PRGI NO: TGTEL/25/A2356

# మేకార్తి దినపత్రిక

జర్నలిస్టులకు ఆహ్వానం
నూతనంగా ప్రారంభించిన
మేకార్తి దినపత్రిక పత్రికలో
అన్ని జిల్లాలలో స్టాఫర్లుగా,మండలాల్లో విలేకర్లుగా పనిచేయుటకు
జర్నలిస్టులు కావలెను
సంప్రదించాల్సిన నెంబర్స్
9014726022,6302041083

మంగళవారం 02-06-2026 | పేజీలు : 6 | వెల రు : 4/- | సంపుటి : 1 సంచిక : 270 | WWW.MEKARTHI DINAPATRIKA.COM

# అవి భారతీయులకు గర్వకారణం..

## అనైమంగళం రాగి శాసనాలపై ప్రధాని మోదీ



- గుర్విందర్, అనిమేష్‌కు మోదీ అభినందనలు.
- 100 మీటర్ల పరుగులో కొత్త రికార్డులు.
- అనైమంగళం శాసనాలు భారత్‌కు తిరిగి వచ్చాయి.
- డాల్ఫిన్ రక్షకులను ప్రశంసించిన ప్రధాని.
- డాల్ఫిన్ అంబులెన్స్ సేవలపై ప్రశంసలు.
- ఎండలపై జాగ్రత్తలు పాటించాలని సూచన.
- మజ్జిగ, షర్బత్ వంటి పానీయాలు తీసుకోవాలని సూచించారు.

భారత అథ్లెట్ గుర్విందర్ సింగ్‌పై ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసలు కురిపించారు. రాంచీలో జరిగిన జాతీయ సీనియర్ అథ్లెటిక్స్ ఫెడరేషన్ పోటీల గురించి ఆదివారం మన్‌కీ బాత్ 134వ కార్యక్రమంలో ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. వందమీటర్ల పరుగులో రికార్డులు సృష్టించిన అథ్లెట్లు గుర్విందర్, అనిమేష్‌తో ఆయన నేరుగా మాట్లాడారు.

కేవలం రెండు రోజుల్లోనే 100 మీటర్ల పరుగు పందెంలో జాతీయస్థాయిలో మూడు రికార్డులు సృష్టించామని మోదీ అన్నారు. ఈ అద్భుతమైన ఘనత సాధించిన ఇద్దరు అథ్లెట్లు గుర్విందర్ సింగ్, అనిమేష్‌కు అభినందనలు తెలిపారు. మోదీ పర్యటన నేపథ్యంలో 'అనైమంగళం' రాగి శాసనాలను నెదర్లాండ్స్ ప్రభుత్వం భారత్‌కు తిరిగి అప్పగించిన సంగతి తెలిసిందే. ఇది భారతీయులు గర్వించదగిన విషయమని మోదీ అన్నారు. ఇక, ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఓ కాలువల చిక్కుకుపోయిన డాల్ఫిన్‌ను కొందరు దాదాపు 13 గంటలపాటు శ్రమించి రక్షించారు. దీనికి సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యింది.



## టీఎంసీ అంతర్గత కుమ్ములాటలే అభిషేక్ బెనర్జీపై దాడికి కారణం: భాజపా

- అభిషేక్ బెనర్జీపై దాడి వెనుక టీఎంసీ అంతర్గత కుమ్ములాటలే కారణమని భాజపా ఆరోపణ.
- అరెస్టైన నిందితులు మాజీ ఎమ్మెల్యే లల్లీ మొయిత్రా అనుచరులేనని భాజపా వ్యాఖ్య.
- టీఎంసీపైనే ప్రజాగ్రహం వ్యక్తమవుతోందని అగ్నిమిత్ర పాల్ అన్నారు.
- టీఎంసీ హింసాత్మక రాజకీయాలకు పాల్పడిందని భాజపా విమర్శ.
- రాష్ట్ర అభివృద్ధికి కలిసి పనిచేయాలని పిలుపు.

2లో

## ధవళేశ్వరం బ్యారేజ్ నుంచి ఖరీఫ్‌కు సాగునీరు విడుదల



రాజమహేంద్రవరం: ఇరిగేషన్‌పై కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాల వల్ల రైతులకు ఎంతో మేలు జరుగుతోందని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. ధవళేశ్వరం బ్యారేజీ నుంచి ఖరీఫ్‌కు ఆయన సాగునీరు విడుదల చేశారు. మంత్రి దుర్గేష్‌తో పాటు కూటమి ప్రజాప్రతినిధులు కార్యక్రమంలో పాల్గొన్నారు. అంతకు ముందు ధవళేశ్వరం బ్యారేజీ వద్ద ప్రత్యేకపూజలు నిర్వహించారు. గోదావరికి జలహారతి ఇచ్చి.. మీట నొక్కి నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టా కాలువకు నీటి విడుదలతో తూర్పుగోదావరి, కోనసీమ, కాకినాడ జిల్లాల్లో ఆయకట్టు రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

# విద్యా వికాస పునర్నిర్మాణానికి నడుం బిగించాం: సీఎం రేవంత్

హైదరాబాద్: పాఠశాల విద్యలో తెలంగాణ పనితీరు గణనీయంగా మెరుగుపడిందని కేంద్ర విద్యాశాఖ.. పెర్ఫార్మెన్స్ గ్రేడింగ్ ఇండెక్స్ లో పేర్కొనడం తమ ప్రభుత్వ రెండేళ్ల కృషికి నిదర్శనమని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. అభివృద్ధికి తొలి కొలమానం విద్య అని చెప్పారు. విద్య ఒక్కటే పేదరికాన్ని నిర్మూలించి, సమాజాన్ని జాగృతం చేయగలదని తాను బలంగా విశ్వసించినట్లు తెలిపారు. ఆ దిశగా ప్రజా ప్రభుత్వం నిరంతరం శ్రమిస్తోందని 'ఎక్స్'లో పోస్టు చేశారు.

ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా విద్యాశాఖ బాధ్యతలు స్వయంగా తీసుకుని.. రెండేళ్లుగా తెలంగాణ మోడల్ స్కూళ్ల ఏర్పాటు, నూతన ఉపాధ్యాయుల నియామకం, డిజిటల్ విద్యకు ప్రాధాన్యం, ప్రభుత్వ బడులకు ఉచిత విద్యుత్ సదుపాయం, ఇతర మౌలిక సదుపాయాల కల్పన, డ్రాపౌట్ల నియంత్రణ వంటి అంశాలపై బలమైన కార్యాచరణ చేపట్టినట్లు వివరించారు.

పదేళ్లలో జరిగిన విద్య విధ్వంసం నుంచి విద్యా వికాస పునర్నిర్మాణానికి నడుం బిగించామన్నారు. తాజా ఫలితాలతో సంతృప్తి పడట్లేదని, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల నిర్మాణం పూర్తయి.. భవిష్యత్‌లో ఈ పాఠశాలలు దేశ విద్యా వ్యవస్థలో తెలంగాణ స్థానాన్ని నెంబర్ వన్‌గా నిలబెడతాయన్న విశ్వాసం ఉందన్నారు. ఆ లక్ష్య సాధన దిశగా కేంద్ర నివేదికలో పేర్కొన్న ఫలితాలు ప్రేరణ ఇచ్చాయని సీఎం తెలిపారు.



# ఆన్‌మార్క్ పోర్టల్..

## లోపాలు పరిశీలిస్తున్నాం : సీబీఎస్ఈ



ఆన్-స్క్రీన్ మార్కింగ్ మూల్యాంకన ప్రక్రియపై వివాదం నేపథ్యంలో సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ ఎట్టకేలకు మౌనం వీడింది. ఈ పోర్టల్‌లో వెలుగు చూస్తున్న లోపాలను నిశితంగా పర్యవేక్షిస్తున్నామని పేర్కొంది. ఈ వ్యవస్థను పటిష్టం చేయడానికి సైబర్ సెక్యూరిటీ నిపుణుల బృందం కొన్ని రోజులుగా పనిచేస్తోందని, ఇప్పటివరకు గుర్తించిన సమస్యలను సరిచేసిందని తెలిపింది. పేజి 2లో ▶

# రైతు డిస్కం..

## 7 గంటలే విద్యుత్ ఇచ్చేలా కుట్ర: హరీశ్‌రావు



2లో

# ట్రాక్టర్ నడిపి..

## పొలం దున్నిన మంత్రి నిమ్మల రామానాయుడు



- మంత్రి నిమ్మల రామానాయుడు స్వగ్రామంలో వ్యవసాయ పనులు చేశారు.
- 7 కి.మీ. సైకిల్ తొక్కి అగర్తిపాలెం చేరుకున్నారు.
- రొయ్యల చెరువును పరిశీలించి మేత వేశారు.
- ట్రాక్టర్ నడిపి పొలం దుక్కిదున్నారు.
- రైతులు వరి నాట్లకు సిద్ధం కావాలని సూచించారు.
- జల సంరక్షణపై ప్రత్యేకంగా పిలుపునిచ్చారు.

పాలకొల్లు మార్కెట్, పాలకొల్లు గ్రామీణం: ఏపీ మంత్రి నిమ్మల రామానాయుడు స్వగ్రామంలో వ్యవసాయ పనుల్లో పాల్గొన్నారు. ఆదివారం ఉదయం పాలకొల్లు నుంచి ఏడు కిలోమీటర్లు సైకిల్ తొక్కుకుంటూ అగర్తిపాలెనికి చేరుకున్నారు. దారి పొడవునా ప్రజల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. సొంత రొయ్యల చెరువులో మేత వేసి.. రొయ్యల ఎదుగుదలను పరిశీలించారు. అనంతరం తన పొలంలో ట్రాక్టర్‌తో దుక్కిదున్నారు. పేజి 2లో ▶

## రైతు డిస్కం పేరుతో సీఎం రేవంత్‌రెడ్డి కొత్త నాటకం: కేటీఆర్



హైదరాబాద్: రైతు డిస్కం పేరుతో సీఎం రేవంత్‌రెడ్డి కొత్త నాటకం ఆడుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గ బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. "రేవంత్‌రెడ్డి గతంలో సాగుకు రోజుకు 3 గంటల విద్యుత్ చాలన్నారు. ఇప్పుడు మాటమార్చి రైతు డిస్కం ఏర్పాటు చేస్తామంటున్నారు. రైతు మెడకు ఉరి పెట్టే డిస్కం అది. కంటోన్మెంట్ ఉప ఎన్నిక సమయంలో స్థానికంగా ఆరు వేల ఇళ్లు కట్టిస్తామన్నారు. ఇప్పటి వరకు ఆరు ఇళ్లయినా కట్టించారా? రేవంత్‌రెడ్డి 420 హామీలు అమలు చేసి చూపించాలి. కేసీఆర్ అప్పులు చేసి సంక్షేమ, అభివృద్ధి పథకాలు అమలు చేశారు. రూ.4 లక్షల కోట్ల అప్పులు చేసిన రేవంత్‌రెడ్డి రాష్ట్రానికి ఏం చేశారో చెప్పాలి" అని కేటీఆర్ డిమాండ్ చేశారు.

## రైతు డిస్కం ఏర్పాటు వెనుక కుట్ర ఉంది: కవిత



# సంపాదకీయం

## ‘జెన్ జీ’.. చూస్తోంది జాగ్రత్త!

..మా పార్టీకి సుదీర్ఘ చరిత్ర ఉందన్న నినాదానికి కాలం చెల్లింది. యువతరంతో కనెక్ట్ కాని పార్టీలు మెల్లగా తెరమరుగవుతున్నాయి. ఈ నేపథ్యంలోనే తాజాగా జరిగిన తెలుగుదేశం పార్టీ మహానాడులో జెన్ జీ, జెన్ ఆల్ఫా పదాలను ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రముఖంగా ప్రస్తావించారు.

..స్వాతంత్ర్యం వచ్చి దాదాపు ఎనభై సంవత్సరాలు అవుతున్నందున స్వాతంత్ర్య పోరాటంలో అప్పటి కాంగ్రెస్ నాయకుల పాత్ర, తెల్ల దొరల పాలనలో ఈ దేశ ప్రజలు అనుభవించిన కష్టాల గురించి నేటి తరానికి అవగాహన లేకుండా పోయింది. దేశానికి స్వాతంత్ర్యం ఆషామాషీగా రాలేదని, ఎంతో మంది ప్రాణత్యాగం చేశారనే విషయం కూడా నేటి తరం తెలుసుకోలేకపోతోంది.

..డెబ్బై అయిదేళ్లు పైబడిన ప్రధాని మోదీ ఈ దేశం యువతతో కనెక్ట్ అవుతుండగా... వయసులో చిన్నవాడైన రాహుల్ గాంధీ యువతను ఆకట్టుకోలేక పోతున్నారు. ఈ పరిస్థితికి కారణాలను అన్వేషించకుండా కాలం చెల్లిన విధానాలు, వివాదాలతోనే ఆ పార్టీ ముందుకు వెళుతోంది.

..మోదీ అధికారంలోకి వచ్చి పన్నెండేళ్లు అవుతోంది. ప్రజల్లో ఆయన పట్ల కూడా కొంత విముఖత ఏర్పడటం మొదలైంది. ప్రతిపక్షం బలంగా లేనప్పుడు ప్రజలే ప్రతిపక్షం బాధ్యత తీసుకుంటారు. బొద్దింకల ఉద్యమమే ఇందుకు నిదర్శనం. అభిజిత్ అనే ఒక దళిత యువకుడు సోషల్ మీడియా వేదికగా ప్రారంభించిన కాక్రోచ్ జనతా పార్టీకి ఫాలోవర్ల సంఖ్య భారతీయ జనతా పార్టీ, కాంగ్రెస్ పార్టీలను మించిపోయింది.

..ఢిల్లీ నుంచి గల్లీ దాకా వివిధ స్థాయిల్లో ఇప్పుడు జవాబుదారీతనం లోపించింది. అధికార దుర్వినియోగం పెచ్చరిల్లింది. ప్రభుత్వాలలో ఏ స్థాయిలో కూడా జవాబుదారీతనం కనిపించడం లేదు. లంచం ఇవ్వనిదే కాగితం కదలని పరిస్థితి. ఈ కారణంగానే ఈ దేశ యువతలో ఆశలు, ఆకాంక్షలతో పాటు నిరాశా నిస్పృహలు చోటుచేసుకుంటున్నాయి.

..నేపాల్, బంగ్లాదేశ్‌లో ప్రజల్లో తిరుగుబాటుకు ప్రభుత్వాలలో జవాబుదారీతనం లోపించడమే ప్రధాన కారణంగా చెబుతున్నారు. దురదృష్టవశాత్తు మన దేశంలో కూడా రాజకీయ వ్యవస్థ మీదే కాదు – కార్యనిర్వాహక, న్యాయ వ్యవస్థ, మీడియా పట్ల కూడా ప్రజల్లో అసంతృప్తి ఉంది. ఈ నేపథ్యంలోనే బొద్దింకల పార్టీ పుట్టుకొచ్చింది.

..అభివృద్ధి మాత్రమే ఓట్లు తెచ్చి పెట్టదు. ప్రభుత్వం పట్ల ప్రజల్లో, ముఖ్యంగా యువతలో ఫీల్ గుడ్ భావన కల్పించాలి. అది రావాలంటే ఇటు ప్రభుత్వంలో, అటు పార్టీలో జవాబుదారీతనాన్ని నెలకొల్పాలి. రాష్ట్రంలో మూడో పార్టీకి చోటు లేదని భావించడానికి లేదు.

జెన్ జీ-- జెన్ ఆల్ఫా! ఇప్పుడు కొత్తగా బొద్దింకలు! ఈ పదాలు వినపడినప్పుడల్లా మన దేశంలోని ప్రధాన రాజకీయ పార్టీలు ఉలిక్కిపడుతున్నాయి. నిన్నటి తరం ఆలోచనలతో, పాత చింతకాయ పచ్చడి విధానాలతో నడుస్తున్న పార్టీలకు ఎన్నికలలో నవతరం నుంచి ప్రతిఘటన ఎదురవుతోంది. యువతరంలో ఆశలు--ఆకాంక్షలు పెరుగుతున్న సమయంలోనే నిరాశా నిస్పృహలు కూడా వారిని కమ్మేస్తున్నాయి. ఫలితంగానే జెన్ జీ--బొద్దింకలు వంటి నినాదాలు పుట్టుకొచ్చి సంప్రదాయ రాజకీయ పార్టీలను తుడిచిపెడుతున్నాయి. మా పార్టీకి సుదీర్ఘ చరిత్ర ఉందన్న నినాదానికి కాలం చెల్లింది. యవతరంతో కనెక్ట్ కాని పార్టీలు మెల్లగా తెరమరుగవుతున్నాయి. ఈ నేపథ్యంలోనే తాజాగా జరిగిన తెలుగుదేశం పార్టీ మహానాడులో జెన్ జీ, జెన్ ఆల్ఫా పదాలను ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రముఖంగా ప్రస్తావించారు. నవతరంతో పార్టీ అనుబంధాన్ని పటిష్ఠం చేసే ప్రయత్నం చేశారు. తమిళనాడు ఎన్నికల ఫలితాల నేపథ్యంలో చంద్రబాబు యువత ప్రాధాన్యాన్ని గుర్తించినట్టుంది. ప్రధాని నరేంద్ర మోదీ కూడా సామాజిక మాధ్యమాలలో యువతరం వెలిబుచ్చుతున్న అభిప్రాయాలను ఎప్పటికప్పుడు తెలుసుకొని తదనుగుణంగా వ్యూహాలు రూపొందించుకోవాలని పార్టీ నాయకులకు దిశా నిర్దేశం చేశారు. నిన్నటి తరానికి చెందిన ఈ ఇరువురు నాయకులూ రేపటి తరం గురించి ఆలోచించడానికి కారణం లేకపోలేదు. ఈ క్రమంలో ముందుగా కాంగ్రెస్ పార్టీ గురించి తెలుసుకుందాం. స్వాతంత్ర్య సంగ్రామాన్ని ముందుండి నడిపించిన కాంగ్రెస్ పార్టీ... ఆ తర్వాత దేశాన్ని సుదీర్ఘ కాలం పరిపాలించింది. తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ నుంచి లాల్‌బహదూర్ శాస్త్రి, ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ, పీవీ నరసింహారావు, మన్మోహన్‌సింగ్ కాంగ్రెస్ పార్టీ నుంచి ప్రధానమంత్రులుగా పనిచేశారు. స్వాతంత్ర్యం వచ్చి దాదాపు ఎనభై సంవత్సరాలు అవుతున్నందున స్వాతంత్ర్య పోరాటంలో అప్పటి కాంగ్రెస్ నాయకుల పాత్ర, తెల్ల దొరల పాలనలో ఈ దేశ ప్రజలు అనుభవించిన కష్టాల గురించి నేటి తరానికి అవగాహన లేకుండా పోయింది. దేశానికి స్వాతంత్ర్యం ఆషామాషీగా రాలేదని, ఎంతో మంది ప్రాణత్యాగం చేశారనే విషయం కూడా నేటి తరం తెలుసుకోలేకపోతోంది. ఫలితంగా ప్రజల్లో జాతీయ భావం మసకబారింది.

ఈ కారణంగానే కాంగ్రెస్ పార్టీ కూడా నేటి తరానికి దూరమైంది. కాంగ్రెస్ నాయకుల పెడ ధోరణులు కూడా మరో ప్రధాన కారణం. నాయకులు అవినీతి రొచ్చులో మునిగితేలడం వల్ల ప్రజలకు కాంగ్రెస్ దూరమైంది. ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ బలిదానాల గురించి ఈ తరానికి పెద్దగా తెలియదు. పార్టీని ఎప్పటికప్పుడు యువతతో కనెక్ట్ చేసుకునే పనిని కాంగ్రెస్ నాయకులు కూడా చేయలేదు. విధానాలను, ఆలోచనలను సవరించుకొని నవీకరించుకోలేదు. అధికారాన్ని బాధ్యతగా కాకుండా సంపాదనకు మార్గంగా భావించడం వల్ల కాంగ్రెస్ పార్టీ నాయకుల పట్ల ప్రజలకు ముఖం మొత్తింది. ఫలితంగా నవ తరానికి ఆ పార్టీ దూరమైంది. విచిత్రమేమిటంటే, డెబ్బై అయిదేళ్లు పైబడిన ప్రధాని నరేంద్ర మోదీ ఈ దేశం యువతతో కనెక్ట్ అవుతుండగా... వయసులో చిన్నవాడైన రాహుల్‌గాంధీ యువతను ఆకట్టుకోలేకపోతున్నారు. ఈ పరిస్థితికి కారణాలను అన్వేషించకుండా కాలం చెల్లిన విధానాలు, వివాదాలతోనే ఆ పార్టీ ముందుకు వెళుతోంది. ఈ కారణంగానే ఉత్తర భారతంలో ఆ పార్టీ తన అస్తిత్వాన్ని దాదాపుగా కోల్పోయే పరిస్థితి ఏర్పడింది. ప్రజలకు మనం ఎందుకు దూరమయ్యామనే ఆత్మపరిశీలన చేసుకోకుండా... ఐదారు దశాబ్దాల క్రితం కమ్యూనిస్టుల నోటి వెంట వెలువడిన నినాదాలను, వారు అనుసరించిన విధానాలను కాంగ్రెస్ పార్టీ అందిపుచ్చుకుంది. తరం మారినప్పుడల్లా ప్రజల ఆకాంక్షలు, ఆలోచనలు మారుతుంటాయని గుర్తించలేకపోతోంది.

### చైనాను చూసైనా...

చైనాలో చోటుచేసుకున్న తియాన్మెన్ స్క్వేర్ ఉదంతాన్నే తీసుకుందాం. అక్కడి కమ్యూనిస్టు ప్రభుత్వం అమలు చేస్తున్న కఠిన ఆంక్షలకు వ్యతిరేకంగా యువత గొంతు వినిపించింది. నిరసనలు ఉద్యమ రూపం సంతరించుకున్నాయి. నాటి ఉద్యమాన్ని అక్కడి ప్రభుత్వం అణచివేసినప్పటికీ... ఆ తర్వాత తన విధానాలను సవరించుకుంది. అంతకు ముందు అమలు చేసిన కఠిన నిబంధనలను సడలించి అనేక వెసులుబాట్లను కల్పించింది. ఇప్పుడు చైనాలో పగటిపూట కమ్యూనిజం, రాత్రి పూట క్యాపిటలిజం అమల్లో ఉంటున్నాయి. సౌకర్యాలు, విలాసాల కోసం పాశ్చాత్య దేశాల వైపు చూసే అవసరం లేకుండా చేశారు. ఫలితంగానే ప్రపంచవ్యాప్తంగా కమ్యూనిజం అంతరించిపోయినా చైనాలో మాత్రం వర్ధిల్లుతోంది. గ్లోబలైజేషన్ ప్రభావం ప్రపంచ దేశాలను చుట్టుముడుతున్న వేళ మన దేశంలో కాంగ్రెస్ పార్టీ సోషలిజం, సెక్యులరిజం వంటి విధానాలను సవరించుకోకుండా పాత విధానాలనే పట్టుకువేలాడింది. ప్రపంచీకరణ ప్రభావం మన దేశంలో గ్రామాలకు కూడా విస్తరించిన వాస్తవాన్ని విస్మరించింది. సెక్యులరిజం కూడా శ్రుతి మించుతోందని ప్రజలు భావిస్తున్న విషయాన్ని కాంగ్రెస్ నాయకులు గుర్తించలేదు. ఈ కారణంగానే ప్రధాని మోదీ తిరుగులేని నేతగా ఎదిగారు.

## ఉగ్రవాదులకు సాయంగా భారత్‌లోకి అక్రమంగా టెలికామ్ సంకేతాలు : పాక్ దుశ్చర్య



ఉగ్రవాద పోషణలో పాక్ వంకర బుద్ధి మారడంలేదు. జమ్మూ కశ్మీర్‌లోని ఉగ్ర నెట్‌వర్క్‌ల కోసం అంతర్జాతీయ టెలికమ్యూనికేషన్ నిబంధనల ఉల్లంఘనలకు కూడా పాల్పడుతోంది. ఇందుకోసం సరిహద్దుల వెంట భారత్ వైపు అక్రమంగా సెల్యూలర్ సంకేతాలను పంపిస్తోంది. ఇది ఉగ్రవాదుల రహస్య కమ్యూనికేషన్లకూ ఊపిరిగా ఉపయోగపడుతోందని అధికారులు వెల్లడించారు.

ఇటీవల పాకిస్థాన్ చర్యలు అధికారుల అనుమానాలను మరింత బలపరుస్తున్నాయి. ముఖ్యంగా దక్షిణ పీర్ పంజాల్ పర్వతశ్రేణుల్లో చొరబాట్లు పెరుగుతున్నాయి. దీనికి తోడు నియంత్రణ రేఖకు అటువైపు పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో ఏర్పాటు చేసిన సెల్ టవర్ల సంకేతాలు కరుడు గట్టిన ఉగ్రవాదులున్న జైళ్లకు చేరుతున్నాయి. కశ్మీర్‌లోని పర్వతశ్రేణులు సహజంగా చాలా వరకు సంకేతాలను అడ్డుకొంటున్నా.. మైదాన ప్రాంతం ఉన్న జమ్మూలో మాత్రం ఈ సంకేతాలు భారత్‌లోకి చొరబడి ఉగ్రనెట్‌వర్క్‌లకు చేరుతున్నాయి.

ముఖ్యంగా కతువా, రాజౌరీ, పూంచ్ జిల్లాలు, జమ్మూలోని కోట్ బల్వాల్ జైలు వంటి ప్రదేశాల వద్ద పాక్ టెలికామ్ సిగ్నల్స్‌ను మన దళాలు గుర్తించాయి. కొన్ని జైళ్లలో ఇప్పటికే జామర్లను ఏర్పాటు చేసినా వీటిని అడ్డుకోవడంలో విఫలం అవుతున్నాయి. అక్రమంగా కారాగారాల్లోకి చేరిన ఫోన్లను ఖైదీలు వినియోగిస్తున్నారు. జమ్మూకశ్మీర్‌లో మొత్తం 14 జైళ్లు, రెండు కరెక్షన్ హోమ్‌లు ఉన్నాయి.

పాకిస్థాన్ టవర్లు చైనాకు చెందిన సీడీఎంఏ టెక్నాలజీని వినియోగిస్తున్నాయి. వీటిల్లో అత్యున్నత స్థాయి ఎన్‌క్రిప్షన్ సాధ్యమవుతుంది. ఇది ఉగ్రవాదులు వాడే వైఎస్ఎంఎస్‌కు ఉపయోగపడుతుంది. సీడీఎంఏ పలు సిగ్నల్స్‌ను ఏకకాలంలో అనుమతిస్తుంది. దీంతో భద్రతా ఏజెన్సీల ఎలక్ట్రానిక్ మానిటరింగ్ సమస్యాత్మకంగా మారుతుంది. దీంతో ఉగ్రవాదులు వైఎస్ఎంఎస్ టెక్నాలజీని విరివిగా వాడుతున్నారు. దీంతో పాక్ పంపే సిగ్నల్స్‌తో పీవోకేలోని హ్యాండ్లర్లు, చొరబాటుదారులు, వారికి ఆశ్రయం ఇచ్చే వారితో నిరంతరం టచ్‌లో ఉంటున్నారు. ఈ అక్రమ విధానాలతో పాకిస్థాన్ ఐరాస అంతర్జాతీయ టెలికమ్యూనికేషన్ యూనియన్ రాజ్యాంగంలోని 45 ఆర్టికల్‌ను ఉల్లంఘిస్తోందని అధికారులు వెల్లడించారు. ఈ ఆర్టికల్ ప్రకారం ఒప్పందంపై సంతకాలు చేసిన మొత్తం 193 దేశాలు తమ భూభాగం నుంచి అధిక, రోగ్, తప్పుడు, తప్పుదోవ పట్టించే సంకేతాలు పక్కదేశాల్లోకి వెళ్లకుండా సహకరించుకోవాలి.

## సాయుధ దళాల వ్యవస్థీకృత సంస్కరణలపైనే దృష్టి: కొత్త సీడీఎస్ రాజా సుబ్రమణి



భారత నూతన చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ (సీడీఎస్)గా జనరల్ రాజా సుబ్రమణి నేడు బాధ్యతలు స్వీకరించారు. మాజీ సీడీఎస్ జనరల్ అనిల్ చౌహాన్ ఆయనకు బాధ్యతలను అప్పగించారు. దీంతో మిలటరీ థియేటరైజేషన్ బాధ్యతలను ఇక నుంచి సుబ్రమణి పర్యవేక్షించనున్నారు. వీటి ద్వారానే భారత త్రివిధ దళాల్లో సమన్వయం పెరుగుతుందని అంచనావేస్తున్నారు.

జనరల్ రాజా సుబ్రమణి చైనా, పాకిస్థాన్ అంశాల్లో నిపుణుడిగా సైనిక వర్గాల్లో పేరుంది. ఆయన నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ సెక్రటేరియట్‌కు మిలిటరీ అడ్వైజర్‌గా కూడా పనిచేశారు. వైస్ చీఫ్ ఆఫ్ ఆర్మీస్టాఫ్‌గానూ బాధ్యతలు నిర్వహించారు. తాజా బాధ్యతల్లో ఆయన ఇంటిగ్రేటెడ్ మిలిటరీ కమాండ్స్ ఏర్పాటుతో.. థియేటరైజేషన్ ప్రక్రియను కూడా పూర్తి చేయాల్సి ఉంటుంది. మరోవైపు సీడీఎస్ జనరల్ అనిల్ చౌహాన్ పదవీ కాలం శనివారంతో ముగిసింది.

సీడీఎస్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత జనరల్ రాజా సుబ్రమణి మీడియాతో మాట్లాడారు. “దేశ సార్వభౌమత్వం, జాతీయ ప్రయోజనాలు కాపాడటానికి సైనిక దళాలు పూర్తిగా కట్టుబడి ఉన్నాయన్నారు. దళాలు దేశ సేవ కోసం పూర్తి అంకితభావంతో పనిచేస్తాయని తాను హామీ ఇస్తున్నట్లు పేర్కొన్నారు.

నేవీ చీఫ్‌గా అడ్మిరల్ స్వామినాథన్ బాధ్యతల స్వీకరణ

నేవీ చీఫ్‌గా అడ్మిరల్ స్వామినాథన్ ఆదివారం ఉదయం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఈ స్థానంలో ఉన్న డీకే త్రిపాఠీ పదవీకాలం శనివారంతో ముగిసిన విషయం తెలిసిందే. ఇప్పటి వరకు స్వామినాథన్ వెస్ట్రన్ నేవల్ కమాండ్‌కు ఫ్లాగ్ ఆఫీసర్ కమాండ్ ఇన్ చీఫ్‌గా బాధ్యతలు నిర్వహించారు. దేశ ప్రయోజనాలు కాపాడేందుకు పూర్తిగా కట్టుబడి ఉంటానని ఈ సందర్భంగా కొత్త నేవీ చీఫ్ వెల్లడించారు.

## గాజియాబాద్‌లో సంచలనం.. మిత్రుడిని హత్య చేసిన యువకుడి ఎన్‌కౌంటర్..!

గాజియాబాద్‌లో ఉద్రిక్తతలకు కారణమైన ఓ హత్య కేసులో నిందితుడు శనివారం అర్ధరాత్రి పోలీసుల ఎన్‌కౌంటర్‌లో ప్రాణాలు కోల్పోయాడు. కొన్నాళ్ల క్రితం సూర్యప్రతాప్ చౌహాన్ (17) అనే యువకుడిని అతడి మిత్రుడు అసద్ మరికొందరితో కలిసి కత్తితో పొడిచి హత్య చేశాడు. ఈ దాడి అనంతరం అతడు పరారయ్యాడు. దీంతో పోలీసులు అతడిపై రూ.50,000 రివార్డ్ ప్రకటించారు.

శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత నిందితుడు అసద్ ఓ మిత్రుడి వద్ద డబ్బులు తీసుకోవడానికి ఖోడా అనే ప్రదేశానికి వస్తున్నట్లు పోలీసులకు సమాచారం వచ్చింది. అతడు నగరం నుంచి పారిపోవాలని ప్లాన్ చేసినట్లు గుర్తించారు. నిందితుడి కోసం పోలీసులు ఇందిరాపురంలో వలపన్నారు. బైక్‌పై అసద్ రాగానే లొంగిపోవాలని పోలీసులు హెచ్చరించారు. అయినా.. అతడు లెక్కచేయకుండా పోలీసులపైకి కాల్పులు జరపడంతో.. వారు ఎదురు కాల్పులు మొదలుపెట్టారు. తూటా అసద్‌కు తగలడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఘటనా స్థలం నుంచి ఓ నాటు తుపాకీ, బైక్ స్వాధీనం చేసుకొన్నారు. అసద్ మిత్రుడు అక్కడి నుంచి తప్పించుకోవడంతో అతడి కోసం గాలింపు చేపట్టారు.

**పాతగొడవ నేపథ్యంలో..**

అసద్, సూర్య మధ్య కొన్ని నెలల క్రితం ఓ విషయంపై గొడవ జరిగింది. దీనిని మనసులో పెట్టుకొన్న అసద్ బక్రీద్ రోజున సూర్యను ఇంటికి ఆహ్వానించాడు. అతడు వచ్చాక.. కత్తితో పొడిచి హత్య చేశాడు. ఈ ఘటన గాజియాబాద్‌లో తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది.

# అవి భారతీయులకు గర్వకారణం..

మొదటిపేజీ తరువాయి

ప్రధాని మోదీ ఈ సంఘటనను కూడా మన్‌కీ బాత్‌లో మాట్లాడారు. గంటలపాటు శ్రమించి డాల్ఫిన్‌ను కాపాడినవారిని అభినందించారు. ఈ సహాయక చర్యల్లో కేంద్రం ఇటీవల కొత్తగా ప్రవేశపెట్టిన డాల్ఫిన్ అంబుల్స్ కీలకపాత్ర పోషించినట్లు తెలిపారు. కేరళలోని ఆలువా ప్రాంతంలో స్విమ్మింగ్ క్లబ్ సేవలను మోదీ ప్రశంసించారు. ఈ క్లబ్ ద్వారా ఇప్పటి వరకు 15వేల మందికి పైగా శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు.

ఎండలో జాగ్రత్త..

ఎండల తీవ్రత దృష్ట్యా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మోదీ పలు సూచనలు చేశారు. బయటకు వెళ్లాల్సి వస్తే తాగునీరు వెంట ఉంచుకోవాలన్నారు. ఆయా రాష్ట్రాల్లో ఎండల నుంచి రక్షణ కోసం వాడే పానీయాలు మామిడి పండ్లు, మజ్జిగ, షర్బత్, బేల్‌పనా గురించి ప్రస్తావించారు.

## టీఎంసీ అంతర్గత కుమ్ములాటలే అభిషేక్ బెనర్జీపై దాడికి కారణం: భాజపా

మొదటిపేజీ తరువాయి

తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ, మమతా బెనర్జీ మేనల్లుడు అభిషేక్ బెనర్జీపై దాడికి వారి పార్టీలోని అంతర్గత కుమ్ములాటలే కారణమని భాజపా పేర్కొంది. ఈ మేరకు భాజపా నేత ప్రదీప్ భండారీ పలు ఆరోపణలు చేస్తూ ఎక్స్ వేదికగా పోస్టు చేశారు. “అభిషేక్ బెనర్జీపై దాడికి టీఎంసీ అంతర్గత వర్గాలే కారణమా..? అరెస్ట్ అయిన ఆరుగురు నిందితులు మాజీ ఎమ్మెల్యే లవ్లీ మొయిత్రాకు సన్నిహిత సహాయకులే. టీఎంసీ శ్రేణులే అభిషేక్‌కు వ్యతిరేకమయ్యాయా? భాయ్‌పో (బెంగాల్‌లో మేనల్లుడు)పై ఏ స్థాయిలో వ్యతిరేకత ఉందో ఊహించుకోండి” అని పేర్కొన్నారు. మరోవైపు పశ్చిమబెంగాల్ మంత్రి అగ్నిమిత్ర పాల్ కూడా టీఎంసీ ఆరోపణలను తోసిపుచ్చారు. టీఎంసీపై ఉన్న ప్రజాగ్రహానికి ఈ ఘటన అద్దంపడుతోందన్నారు. “ఈ రోజుల్లో మనం నిజమైన ప్రజాగ్రహం చూస్తున్నాం. కొన్నేళ్లుగా మమతా, అభిషేక్, టీఎంసీ హింసాత్మక రాజకీయాలకు పాల్పడ్డారు. ఇప్పుడు కూడా వారు అటువంటి వాటికి యత్నిస్తే మాత్రం చూస్తూ ఊరుకోము” అని హెచ్చరించారు. హంతకులు ఎవరో ప్రజలు చెబుతున్నారని అగ్నిమిత్ర పాల్ వ్యాఖ్యానించారు. అభయా ఎలా చనిపోయింది..? మహిళలు గత 15 ఏళ్లుగా హింసను ఎలా అనుభవించారు? కమ్దునీ, పార్క్ స్ట్రీట్‌లలో వందల మంది మా పార్టీ కార్యకర్తలను హత్య చేసి చెట్లకు వేలాడదీసింది చూడాలి. అభివృద్ధి లక్ష్యంతోనే కొత్త ప్రభుత్వం వచ్చింది. రాష్ట్ర ప్రగతి కోసం కలిసి జట్టులా పనిచేద్దాం” అని పేర్కొన్నారు.

# ఆన్‌మార్క్ పోర్టల్..

### లోపాలు పరిశీలిస్తున్నాం : సీబీఎస్ఈ

మొదటిపేజీ తరువాయి

“ఆన్‌మార్క్ పోర్టల్‌లో వెలుగు చూస్తోన్న లోపాలను నిశితంగా పర్యవేక్షిస్తున్నాం. ఈ వ్యవస్థలను పటిష్టం చేయడానికి గత కొన్ని రోజులుగా ఐఐటీలు, వివిధ ప్రభుత్వ విభాగాలతో కూడిన సైబర్ సెక్యూరిటీ నిపుణులు ప్రయత్నిస్తున్నారు. వ్యవస్థను మరింత సురక్షితంగా మార్చేందుకు కృషి చేస్తున్నారు. ఇప్పటికే గుర్తించిన లోపాలను సరిచేశారు. ఇంకా ఏమైనా లోపాలు ఉన్నాయా? అనేది పరిశీలిస్తూ కట్టడి చేసే పనిలో ఉన్నారు. ఈ వ్యవహారంలో అప్రమత్తంగా ఉంటూ లోపాలను ఎత్తిచూపుతున్న పౌరులు, ఎథికల్ హ్యాకర్లందరికీ కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం. వారిలో కొందరిని సంప్రదించాం. మరేదైనా సమాచారం ఉంటే సైబర్ భద్రతా విభాగాన్ని సంప్రదించవచ్చు” అని ఎక్స్ వేదికగా సీబీఎస్ఈ సూచించింది.

# ఎన్నిసార్లు దొరికిపోయినా..

### కుట్ర రాజకీయాలు మానరా?: నారా లోకేశ్

మొదటిపేజీ తరువాయి

ఆదివారం సెలవు రోజున కొద్దిపాటి సమయం దొరకడంతో తనకు ఇష్టమైన వ్యవసాయ పనుల్లో పాల్గొన్నట్లు మంత్రి నిమ్మల చెప్పారు. సొంత వ్యవసాయ పనుల్లో కార్మికులతో కలిసి పనిచేయడం ఎంతో సంతృప్తిగా ఉంటుందన్నారు. షెడ్యూల్ ప్రకారం ఆదివారం గోదావరి డెల్టాకు సాగు నీరు విడుదల చేశామని చెప్పారు. రైతులందరూ ముందస్తుగా వరి నాట్లు వేసేందుకు సిద్ధం కావాలని సూచించారు. ఎల్‌నినో నేపథ్యంలో సాగు నీటిని సక్రమంగా వినియోగించుకుంటూ జల సంరక్షణ చేపట్టాలని పిలుపునిచ్చారు.

# రైతు డిస్కం పేరుతో సీఎం రేవంత్‌రెడ్డి కొత్త నాటకం: కేటీఆర్

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్: రైతు డిస్కం.. అన్నదాతల పాలిట శాపంగా మారనుందని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. ఈ డిస్కం వల్ల తాగునీటి ప్రాజెక్టులకు కూడా కరెంట్ కోతలు వస్తాయని చెప్పారు. ఆదివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి తీరుపై మండిపడ్డారు.

“ప్రస్తుతం రైతులకు రోజుకు 13 గంటలకు మించి కరెంట్ ఇవ్వట్లేదు. రైతు డిస్కం ఏర్పాటుతో 7–8 గంటలే ఇచ్చేందుకు కుట్రలు చేస్తున్నారు. గుజరాత్‌లో రైతులకు 7 గంటలే విద్యుత్ ఇస్తున్నారు. బడే భాయి మోదీ విధానాలనే అమలు చేసేందుకు ఛోటా భాయి యత్నిస్తున్నారు. రైతు డిస్కంలో సౌర విద్యుత్ మాత్రమే ఇస్తామని జీవోలో పేర్కొన్నారు. ఆ విద్యుత్‌తో ఎత్తిపోతల ప్రాజెక్టుల మోటార్లు ఎలా నడుస్తాయి?”అని హరీశ్‌రావు ప్రశ్నించారు.

# రైతు డిస్కం ఏర్పాటు వెనుక కుట్ర ఉంది: కవిత

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతు వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నాయని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మండిపడ్డారు. హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్, మీటర్లు బిగించబోమన్న సీఎం.. ఆ విషయాన్ని మీడియా చిట్‌చాట్‌లో కాకుండా అధికారికంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు.

రైతు డిస్కం ఏర్పాటు చేయడం వెనుక మిగిలిన రెండు డిస్కంలను ప్రైవేటీకరించే కుట్ర దాగి ఉందని ఆరోపించారు. ఈ కుట్రను అడ్డుకునేందుకు సుప్రీంకోర్టు వరకైనా వెళ్తామని స్పష్టం చేశారు. కేంద్రం తెచ్చిన కొత్త సోలార్ జీవో.. బడా కార్పొరేట్ సంస్థలకే మేలు చేస్తోందని ధ్వజమెత్తారు.

ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యుల నిర్లక్ష్యం వల్ల 18 రోజుల పసికందు చేయి కోల్పోయిన ఘటన దారుణమన్నారు. సీఎం, ఖమ్మం జిల్లా మంత్రులు బాధ్యత వహించి ఆ చిన్నారి పేరిట రూ.25 లక్షలు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయాలని డిమాండ్ చేశారు. దసరా నాటికి లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టును ప్రతిపాదించకపోతే పాదయాత్ర చేపడతామని హెచ్చరించారు.

# హుస్నాబాద్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మీడియా సమావేశంలో

**– మంత్రి పొన్నం ప్రభాకర్**

మేకార్తి దినపత్రిక మే 01 ప్రతినిధి

పవన్ కళ్యాణ్ తెలంగాణ ప్రజలకు క్షమాపణలు చెప్పిన తరువాతనే నవ నిర్మాణ సభ పెట్టుకోవాలితెలంగాణ అస్థిత్వం,ఆత్మగౌరవం దెబ్బతీసేలా మాట్లాడిన పవన్ కళ్యాణ్ బీజేపీ ఎజెండా మోస్తున్నారు తెలంగాణ మీద విషం కక్కి తెలంగాణ ప్రజల చూపు పడితే కోనసీమ కొబ్బరి చెట్లు ఎండిపోతున్నాయని చెప్పిన పవన్ కళ్యాణ్ తెలంగాణ ప్రజలకు క్షమాపణలు చెప్పాలి తెలంగాణ ఏర్పడితే 11 రోజులు అన్నం మానేసినా అని బహిరంగంగా చెప్పిన వ్యక్తి తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో పాల్గొంటే మాకు అభ్యంతరం లేదు కానీ ఇక్కడ నవ నిర్మాణ సభ పెడితే తీవ్ర ఆక్షేపిస్తున్నాం.కన్న తల్లికి గాజులు కొనలేని వాడు పినతల్లి కి ఒడ్డాణం చేస్తారని సమేత ఉంది.. కుట్ల రాయి తీయలేని వాడు..ఎట్లా రాయి తీస్తాడా..రేపు తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం దీనిని ప్రతి తెలంగాణ బిడ్డ వేడుకల పండగల జరుపుకుంటాం..ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కలిసి విడిపోయిన రాష్ట్రంగా మాకు ప్రేమ ఉంటది..భారతీయులుగా ఇతర రాష్ట్రాలను గౌరవించాలి..అవమాన

పరుచుకోవద్దు..తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో పాల్గొనాలనుకుంటే ఎవరైనా పాల్గొనచ్చు..ఆంధ్రపదేశ్ ఉప ముఖ్యమంత్రి గా చేయలేనిది ఇక్కడికి వచ్చి నవ నిర్మాణ సభ పెడితే ఎవరు వినడానికి సిద్దంగా లేరు..తెలంగాణ ఏర్పడితే 11 రోజులు అన్నం తినను అన్న వెధవ వచ్చి. ఇక్కడ తెలంగాణ పట్ల మొసలి కన్నీరు కారిస్తే ఒప్పుకోము వాస్తవంగా పవన్ కళ్యాణ్ సినిమా నటుడు .. . తెలంగాణ లో విద్వేషాలు రెచ్చగొట్టేలా మాట్లాడి తెలంగాణ వాతావరణాన్ని కలుషితం చేయాలని బీజేపీ తో లోపాయికారి ఒప్పందం చేసుకొని పవన్ కళ్యాణ్ ఈ నటన స్టార్ట్ చేశారు..2014 లో నేను పార్లమెంట్ సభ్యుడిగా ఉన్నప్పుడు పోచేస్తున్నప్పుడు పవన్ కళ్యాణ్ ఇక్కడికి వచ్చారు.. తొడకలు తీస్తాం అని చెప్పం..తెలంగాణ కళ్ళ దృష్టి పడితే కోనసీమ కొబ్బరి చెట్లు ఎండిపోయాయనీ చెప్పిన పవన్ కళ్యాణ్ తెలంగాణ రక్తం ఉన్న ఏ బిడ్డ ఆయన సభకు పోరు..బీజేపీ రెన్యుమనేషన్ ఇస్తే ఇక్కడికి రాలేదని కొండగట్టు అంజన్న మీద ప్రమాణం చేసి చెప్పు పవన్ కళ్యాణ్..మాకు అస్సాం కంటే ఆంధ్రప్రదేశ్ దగ్గర.. ఆంధ్రప్రదేశ్ తో సత్సంబంధాలు ఉండాలని కోరుకుంటాం..తెలంగాణ ఏర్పడితే 11 రోజులు అన్నం తినలేదని అన్న దానికి సమాధానం చెప్పు..తెలంగాణ కోసం పార్లమెంట్ సభ్యుడిగా ,సకల జనుల సమ్మె ద్వారా తెలంగాణ కోసం పోరాటం చేసినం..తెలంగాణ అమరవీరుల కుటుంబాలకు ,పోరాట యోధులను గుర్తించాలని ప్రభుత్వం కమిటీ వేసి ముందుకు పోతుంది.. వారిని గుర్తించి గౌరవించాలని ప్రభుత్వం కార్యక్రమం చేస్తుంది..తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా మాట్లాడిన ఆయన తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం రోజు ఇక్కడే ఎందుకు సభ పెడుతున్నారు..నవ నిర్మాణ సభ గుజరాత్ ,కేరళ , ఉత్తర ప్రదేశ్ ,తమిళనాడు లో ఎందుకు పెట్టడం లేదు..బీజేపీ డైరెక్షన్ లో తెలంగాణ లో విద్వేషాలు రెచ్చగొట్టి వైషమ్యాలు రెచ్చగొట్టేలా చేస్తే ఊరుకోరు.. పవన్ కళ్యాణ్ పైసలు ఇస్తే ఏం నటన చేయమంటే అది చేస్తాడు..మీరు సినిమా నటులు ఏమైనా మాట్లాడొచ్చు.. కానీ తెలంగాణ పై రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తే ఊరుకోం..మా తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని గాయపరిచేలా మాట్లాడిన వ్యక్తి వహిస్తే సహించం..పవన్ కళ్యాణ్ అభిమానులు సినిమా చూడండి కానీ మన తెలంగాణ అస్తిత్వం మీద దాడి చేస్తే ఎవరు చూస్తూ ఊరుకోరు ఇది ప్రజాస్వామ్య దేశం. తెలంగాణలో ప్రజా ప్రభుత్వం నడుస్తోంది ప్రజాస్వామ్యంలో ఎవరు ఎక్కడైనా సభలు సమావేశాలు పెట్టుకోవచ్చు. హైదరాబాదులో పవన్ కళ్యాణ్ నవనిర్మాణ సభ పేరు వెనుక ఆంతర్యం ఏమిటి.? బిజెపికి తెలంగాణను తాకట్టు పెట్టడమే మీరు స్థాపించే నవనిర్మాణమా? మీకు ఏపీ ప్రజలు ఆశీర్వదించి అధికారం ఇచ్చారు. అక్కడ చూయించండి మీ నవనిర్మాణము. కూట్లే రాయి తీయకుండా ఎట్ల రాయి ఇస్తానని బయలు తేరడం ఎందుకు? పవన్ కళ్యాణ్ నవనిర్మాణ సభలు బిజెపి పాలిత గుజరాత్ మధ్యప్రదేశ్ లో ఉత్తర ప్రదేశ్ లో ఎందుకు ఏర్పాటు చేయడం లేదు? మీ బాస్ మోదీ ను మెప్పించడానికి తెలంగాణ లో సభ పెడుతున్నారా..? తెలంగాణలో సభ ఏర్పాటు చేయాలి. నాలుగు రెచ్చగొట్టే మాటలు



మాట్లాడాలి. ఇక్కడ జనాలు తన్నుకు చావాలి . ఇదేనా మీ పవనిజం? అనువనవున తెలంగాణ వ్యతిరేకతను నింపుకున్న పవన్ కళ్యాణ్ మొదట తెలంగాణ వాదులకు క్షమాపణ చెప్పాలి. తక్షణమే తెలంగాణ ప్రజలకు మీరు క్షమాపణలు చెప్పాలి.. తెలంగాణ ద్వేషి పవన్ కళ్యాణ్. ఇక్కడ విద్వేష రాజకీయాలు చేస్తామంటే ఊరుకునేది లేదు.ఇక్కడ బిజెపి పప్పులు ఉడకక... ఏజెంట్ గా పవన్ కళ్యాణ్ ఇక్కడికి పంపిస్తున్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తెలంగాణకు చేసిన ఏమీ లేదు. అందుకే ఇక్కడ బిజెపి దొడ్డిదారిన పవన్ కళ్యాణ్ ను పంపిస్తోంది.హీరోగా పవన్ కళ్యాణ్ ను అభిమానిస్తాం, ఆదరిస్తాం.. కానీ రాజకీయ నాయకుడిగా తెలంగాణ వ్యతిరేకిగా ముద్ర ఉన్న పవన్ కళ్యాణ్ ను నిలదీస్తాం.పవన్ సార్ధక నామదేయుడు. ఆయన వ్యవహార శైలి గాలివాట చందం. చేగువేరా టీ షర్టుతో ప్రారంభమైన ప్రస్థానం.. ఇప్పుడు మోడీ నీకు కౌగిలించుకొని ప్రజల చేత చీకట్టుకునే పరిస్థితి తెచ్చుకున్నాడు.తెలంగాణలో నువ్వు ఉద్ధరించేది ఏంటి పవన్ కళ్యాణ్... ఏపీ ప్రజలు ఇబ్బందుల్లో ఉన్నారు ఆదుకో. విశాఖ ఉక్కును ప్రైవేటుపరం చేస్తుంటే గుడ్లు అప్పగించి చూసింది నువ్వు. కృష్ణపట్నం గంగవరం పోర్టులు పదానికి కట్టబెట్టిన మోడీని ప్రశ్నించని చేతగానితనం నీది.దేశంలో పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరలు పెరుగుతుంటే మారు మాట్లాడనిది నువ్వు. జనగణనలో కులగన చేపట్టకపోతే నోరు మెదపనిధి నువ్వు. సినిమాల్లో దేశభక్తి చూపించడం కాదు నిజజీవితంలో దేశభక్తి చూయించు పవన్ కళ్యాణ్. దేశంలో నిరుద్యోగం పెరుగుతుంది. నిరుద్యోగులంతా ఇబ్బంది పడుతున్నారు. మీ ఫ్యాన్స్ చాలామంది నిరుద్యోగులే ఉన్నారు. చేతనైతే వారికి ఉద్యోగాలు ఇప్పించు. కేవలం జై జైలు కొట్టించుకొని పస్తులు ఉంచడం తగదు.

# చందుర్తి శ్రీ షిరిడి సాయిబాబా ఆలయ కమిటీ కార్యవర్గం ఎన్నిక



మేకార్తి దినపత్రిక, జూన్ 01 చందుర్తి మండల రిపోర్టర్.

చందుర్తి మండల కేంద్రంలోని శ్రీ షిరిడి సాయిబాబా ఆలయ అభివృద్ధి కమిటీ ఎంపిక చేశారు.శ్రీ షిరిడి సాయిబాబా ఆలయంలో సోమవారం ఏర్పాటు చేసిన ఎన్నిక సమావేశంలో అధ్యక్షులుగా మర్రి (షిరిడి) మల్లేశం, ఉపాధ్యక్షులుగా పిట్టల బాబు,కోశాధికారగా వులిసె గిరి ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా అర్నేని సతీష్ రావు, సలహాదారులుగా పులి సత్యం గౌడ్, మర్రి కృష్ణ, పొంచెట్టి తిరుమల్, రాజూరి బ్రహ్మచారి, దారం రామచంద్రం, పత్తిపాక వెంకటేష్ లను ఎంపిక చేశారు. నూతన కమిటీని శాలువాలతో సత్కరించారు.ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన చందుర్తి గ్రామపంచాయతీ మాజీ సర్పంచ్ గొట్టె ప్రభాకర్ మాట్లాడుతూ...చందుర్తి షిరిడి సాయిబాబా ఆలయ అభివృద్ధి కమిటీ ఎన్నిక చేయడం అభినందనీయమని, గతంలో నుండి ఆలయ అభివృద్ధితోపాటు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని, నూతన కమిటీతో నూతనోత్సహం పెరుగుతోని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో శ్రీ షిరిడి సాయిబాబా భక్తుల పాల్గొన్నారు.

# భర్త వేధింపులకు భరించలేక ఎలుకల మందు వివాహిత ఆత్మహత్య ...

మేకార్తి దినపత్రిక, జూన్ 01 చందుర్తి మండల రిపోర్టర్



సనుగుల గ్రామం నకు చెందిన టేకుమాట్లా అంజవ్వ తన భర్త వేధింపులకు భరించలేక నిన్నటి రోజున బర్త్ ఆకయ్య కు మరియు మృతురాలి మద్య టూ వీలర్ కావాలనే విషయంలో గొడవ జరిగింది. మనస్తాపం చెందిన అంజవ్వ ఎలుకలు మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించింది. సమీప బంధువుల సహాయంతో వేములవాడ ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మరణించినది . కుటుంబ సభ్యుల కథనం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వేములవాడ డిఎస్పీ శ్రీనివాసులు తెలిపారు. మృతురాలి కి ముగ్గురు పిల్లలు కలరు

# ధాన్యం కొనుగోళ్లు, అన్ లోడింగ్ లో వేగం పెంచాలి

**– వాహనాలు, హమాలీల సంఖ్యను మరింత పెంచాలి**
**– జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**
**– ధాన్యం కొనుగోళ్లపై టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించిన కలెక్టర్**

మేకార్తి దినపత్రిక జూన్ -01 రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి

జిల్లాలోని అన్ని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు, అన్ లోడింగ్ లో మరింత వేగం పెంచాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. జిల్లాలోని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణ, అపరెల్ పార్క్, రైస్ మిల్లులు, గోదాంలలో అన్ లోడింగ్ వేగవంతం చేయడం,



ఆన్ లైన్ ట్యాబ్ ఎంట్రీ పురోగతి, తదితర అంశాలపై అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, పౌర సరఫరాలు, సహకార శాఖ, గ్రామీణాభివృద్ధి శాఖ, మెప్మా, రవాణా, తదితర శాఖల జిల్లా అధికారులతో కలెక్టర్ సోమవారం ఉదయం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. కొనుగోలు కేంద్రాల్లో తూకం ఉన్న బస్తాలను వెంటనే అపరెల్ పార్క్, రైస్ మిల్లులు, గోదాములకు తరలించేలా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. గన్నీ సంచులు, కొనుగోలు కేంద్రాల్లో చేస్తున్న ట్యాబ్ ఎంట్రీ, తదితర వివరాలు ఆరా తీశారు. కొనుగోళ్ళు పూర్తయిన కేంద్రాల నుంచి వాహనాలు, హమాలీలను అపరెల్ పార్క్ కు పంపించి, అన్ లోడింగ్ వేగవంతం చేయడంపై దృష్టి సారించాలని, వాహనాలను ఇతర కేంద్రాలను తరలించాలని సూచించారు.సాధ్యమైనంత త్వరగా కొనుగోళ్ళు సజావుగా పూర్తయ్యేలా చూడాలని ఆదేశించారు. ట్రాన్స్ పోర్ట్ కాంట్రాక్టర్లు సరిపడా వాహనాలు సమకూర్చేలా ఆదేశాలు జారీ చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు.

# ట్రాక్టర్ డబ్బులో ఈత సరదా

**– తీవ్రమైన ఎండకు ఉపశమనం**
**– మండల కేంద్రంలో స్విమ్మింగ్ పూల్ ఏర్పాటు చేయాలి**

మేకార్తి దినపత్రిక (జూన్ 2) గన్నేరువరం మండలం ప్రతినిధి కోటేష్ గౌడ్



తీవ్రమైన ఎండకు ప్రజలు చిన్నారులు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో వేసవి తాపాన్ని తట్టుకునేందుకు కరీంనగర్ జిల్లా గన్నేరువరం మండలం కూనవానిపల్లెలో ఉపశమనం కోసం చిన్నపిల్లలకు ఇంటి ముందు ట్రాక్టర్ డబ్బాలో కవర్ పెట్టు నీళ్లు పోసి దానిలో చిన్న పిల్లలకు ఈత సరదాను అలాగే వేసవి ఉపశమనం కోసం ఆ నీటిలో సేద తీరుతున్నారు. అనంతరం కూన యాదగిరి మాట్లాడుతూ పిల్లలు బావుల్లో ఈత నేర్చుకోవడానికి వెళ్లి ప్రాణాలు కోల్పోతున్నారని అన్నారు మండల కేంద్రంలో స్విమ్మింగ్ పూల్ ఏర్పాటు చేసినట్లయితే పిల్లల ఈత సరదా తీరుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# అమ్మపురం లో ఘనంగా సి బి సి కార్యక్రమాలు.

**– పిల్లల్లో ఆధ్యాత్మిక చైతన్యం, ఆత్మవిశ్వాసం పెంపు.**

మేకార్తి దినపత్రిక జూన్ 1 సిద్దిపేట జిల్లా బ్యూరో కర్రోల్ల అన్నమ్మ.

నర్మెట్ట మండలం, అమ్మపురం గ్రామంలోని జీసస్ గాస్పల్ మందిరం నందు సి బి సి కార్యక్రమాలను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పిల్లలకు ఆధ్యాత్మిక వాక్య భాగాలను బోధించారు. చిత్రపటాలు, చేతిపనులు మరియు రంగులు వేయడం లాంటి సృజనాత్మక కార్యక్రమాల ద్వారా పిల్లలలో మంచి చైతన్యం, ఆత్మవిశ్వాసం పెంపొందించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమాలలో ప్రతిభ కనబరిచిన అర్హులైన పిల్లలకు దైవ సేవకులు పాల్సన్ రాజ్ రూతు, సి బి సి టీచర్లు చుంచు జ్యోతి మరియు ఏనుగుల జ్యోతి చేతుల మీదుగా బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సి బి సి టీచర్లు కు కూడా బహుమతులు ప్రధానం చేసి, శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో చర్చి ప్రతినిధులు, సంఘ పెద్దలు, యవ్వనస్తులు, స్త్రీలు, పిల్లలు తదితరులు పాల్గొన్నారు.





# గుర్తుతెలియని వ్యక్తులు పొలాలలోని వరి కొయ్యలకు నిప్పు పెట్టడంతో పశుగ్రాసం దగ్ధం

**బ్లూ కోర్ట్ సిబ్బంది రమేష్ మహిపాల్ ను పలువురు అభినందించారు**

మేకార్తి దినపత్రిక జూన్ 1 గంభీరావుపేట మండల రిపోర్టర్



రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం లింగన్నపేట గ్రామంలో సోమవారం రోజున రోజున పొలాల వద్ద వరి కోయాలకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో మండుటెండకు ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో పొలాలలోని గడ్డివాములు, స్టార్టర్లు, వైర్లు, బోరు పైపులు పూర్తిగా దగ్ధమయ్యాయి. అటుగా వెళుతున్న బ్లూ కోర్స్ సిబ్బంది వెంటనే స్పందించి మంటలను అదుపులోకి తెచ్చారు. వారికి సహాయంగా కొందరు రైతులు కూడా వచ్చి మంటలను ఆర్పి వేశారు. సంఘటన స్థలానికి ఎస్సై సిహెచ్ శ్రీకాంత్ వెళ్లి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. రైతులు తమ పశుగ్రాసం దగ్ధమైందని ఆవేదన వ్యక్తం చేశారు. గుర్తుతెలియని వ్యక్తులు చేసిన పాపానికి మా యొక్క పశుగ్రాసం దగ్ధమైందని అన్నారు. బ్లూ కోర్ట్ సిబ్బంది రమేష్ మహిపాల్ లను పలువురు అభినందించారు.

# అవతరణ దినోత్సవ వేడుకల ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్, ఎస్పీ



మేకార్తి దినపత్రిక,జూన్ – 01 రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి

రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా నిర్వహించనున్న కార్యక్రమాల ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితె సోమవారం సాయంత్రం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్ లో రాష్ట్ర అవతరణ వేడుకలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. వేదిక, పరేడ్ నిర్వహణ, ప్రజాప్రతినిధులు, ప్రెస్, అధికారులు, తదితరులు కూర్చునేందుకు, వాహనాల పార్కింగ్, తదితర అంశాలకు సంబంధించిన ఏర్పాట్లను సంబంధిత అధికారులను అడిగి కలెక్టర్, ఎస్పీ ఆరా తీశారు. పరిశీలనలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, అదనపు ఎస్పీ చంద్రయ్య, డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, ఎస్బీ డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ రవి, ఆర్ ఐ లు సురేష్, మధుకర్, తహసీల్దార్ మహేష్, తదితరులు ఉన్నారు.

# మండలంలో జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలి

**– ఏఐఎస్ఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి ముల్కల పవన్**

మేకార్తి దినపత్రిక (జూన్ 2) గన్నేరువరం మండల ప్రతినిధి బుర్ర కోటేష్ గౌడ్



గన్నేరువరం మండలంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆల్ ఇండియా స్టూడెంట్ ఫెడరేషన్ (ఏఐఎస్ఎఫ్) మండల ప్రధాన కార్యదర్శి ముల్కల పవన్ మాట్లాడుతూ మండలంలో కళాశాల లేక విద్యార్థి విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని కళాశాల లేక చాలామంది పదవ తరగతి పూర్తి కాగానే మధ్యలోనే చదువు ఆపేసి ట్రాక్టర్లు డ్రైవర్లు గా కూలి పనులకు వెళ్తున్నారని అని అన్నారు చెడు వ్యసనాలకు అలవాటుపడుతూ బంగారు భవిష్యత్తును పాడు చేసుకుంటున్నారని అన్నారు. మండలంలో జూనియర్ కళాశాల మోడల్ స్కూల్ లేవు ఉన్న తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ ఎక్కడో ఉండటం మండల విద్యార్థిలకు శాపంగా మారింది కాబట్టి మండల విద్యార్థుల భవిష్యత్తు దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం చొరవ చూపి మండలంలోని వెంటనే జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలి లేనిచో మండల విద్యార్థులతో కలిసి రానున్న రోజుల్లో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో భారీ ఎత్తున విద్యార్థి ఉద్యమం చేస్తామని అన్నారు.

# రోడ్డు భద్రత సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**– చిట్యాలలో కనువిప్పు కళా ప్రదర్శన.**

మేకార్తి దినపత్రిక జూన్ 1 సిద్దిపేట జిల్లా బ్యూరో కర్రోల్ల అన్నమ్మ.

సిద్దిపేట జిల్లా కలెక్టర్ మరియు జిల్లా పోలీస్ కమిషనర్ రష్మి పెరుమాల్ ఆదేశాల మేరకు జిల్లా సమాచార పౌరసంబంధాల శాఖ అధికారి బిజ్జురి రవికుమార్ తెలంగాణ సాంస్కృతిక సారధి సంయుక్త ఆధ్వర్యంలో చేర్యాల మండలం చిట్యాల గ్రామంలో ఆదివారం రాత్రి రోడ్డు ప్రమాదాల నివారణ సైబర్ నేరాలపై పోలీస్ కనువిప్పు సారధి కళాబృందం ద్వారా ప్రజలను చైతన్య పరచగా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా చేర్యాల పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ నవీన్ కుమార్ హాజరై మాట్లాడుతూ సైబర్ నేరాలపై జాగ్రత్తగా ఉండాలని మానవ తప్పిదం వల్లే సైబర్ నేరాలు ఎక్కువగా జరుగుతున్నాయని బ్యాంకు అధికారులు అని ఫోన్ చేస్తే నమ్మవద్దు అని అకౌంట్ డీటెయిల్స్ పర్సనల్ గుర్తుతెలియని వ్యక్తులకు షేర్ చేయవద్దు అని ఏదైనా సైబర్ నేరం జరిగితే వెంటనే 1930 కాల్ చేసి ఫిర్యాదు చేయాలని తెలిపారు యువత బెట్టింగ్ లకు పాల్పడి జీవితాలు నాశనం చేసుకోవద్దని ఆన్లైన్ గేమ్స్ ఆడి మీరు మీ కుటుంబాలను రోడ్డున పడవేయవద్దని కోరారు చిన్న చిన్న విషయాలకు ఆత్మహత్య చేసుకుని జీవితాలు నాశనం చేసుకోవద్దు అని మరియు రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలు ట్రాఫిక్ నిబంధనలు పాటించి వాహనాలు నడిపి క్షేమంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని ప్రతి ఒక్కరు హెల్మెట్ వాడాలని సూచించారు, యువత గంజాయి ఇతర మత్తు పదార్థాలకు అలవాటు పడొద్దని విలువైన జీవితాలు ఆగం చేసుకోవద్దని కోరారు,తల్లిదండ్రులు వారి పిల్లలకు బాధ్యత నేర్పించాలని ప్రజలు మూఢనమ్మకాలను వీడాలని శాంతి భద్రతలకు విఘాతం కల్పిస్తే కఠిన చర్యలు ఉంటాయని



ఏదైనా సమస్యలు ఉంటే టోల్ ఫ్రీ నెంబర్ 100 కు ఫోన్ చేయాలని ప్రజలను కోరారు,ఈ కార్యక్రమంలో సర్పంచ్ జానకి స్వామి లీల,పోలీస్ కనువిప్పు బృందం బాలు,రాజు, తిరుమల, మరియు తెలంగాణ సాంస్కృతిక సారధి కవి గాయకులు పిన్నింటి రత్నం,దూల్మిట్ట గెంటే హరిప్రసాద్,సనువాల కనుకయ్య,ఎల్ల సిద్దులు,తండ బిక్షపతి, తదితరులు ప్రజలకు అవగాహన కల్పించారు.

# ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి.. సంరక్షించాలి

**– జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**
**– ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా లిపర్యావరణ ఉత్సవాలు కింద మొక్కలు నాటిన జిల్లా కలెక్టర్, ఎస్పీ, డీఎఫ్ఓ, జిల్లా అధికారులు, యువత**

మేకార్తి దినపత్రిక జూన్ – 01 రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి

వాతావరణ సమతుల్యత.. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటాలని.. వాటిని సంరక్షించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపునిచ్చారు. ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా జూన్ 1 వ తేదీ నుంచి 12 వ తేదీ వరకు పర్యావరణ ఉత్సవాలలో భాగంగా జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం



సమీపంలో జిల్లా అటవీ శాఖ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించగా, ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితె, జిల్లా అటవీ శాఖ అధికారి ఎస్ సత్యనారాయణ, జిల్లా అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, ఎస్పీ, డీఎఫ్ఓ, జిల్లా అధికారులు, యువత, విద్యార్థులు మామిడి మొక్కలు నాటి.. నీటిని పోశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ... పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా తమ ప్రాంతాల్లోని ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. మొక్కలు నాటడంతో ప్రస్తుతంతో పాటు భవిష్యత్ తరాలకు ఎంతో మేలు చేకూరుతుందని పేర్కొన్నారు. పర్యావరణ ఉత్సవాల కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమాల్లో అందరినీ భాగస్వామ్యం చేయాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, సీపీఓ శ్రీనివాసాచారి, జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, జిల్లా పంచాయతీ అధికారి షరీఫ్ుద్దిన్, ఉద్యానవన శాఖ అధికారి శరత్, మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా, అటవీ శాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బాధితుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రీవెన్స్ డే కార్యక్రమం.

**– గ్రీవెన్స్ డే కార్యక్రమంలో 33 ఫిర్యాదులు స్వీకరణ:జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే.**

మేకార్తి దినపత్రిక, జూన్ 01 రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి

ప్రజల వద్ద నుండి ఫిర్యాదులు స్వీకరించి సమస్యల పరిష్కారమే లక్ష్యంగా బాధితులకు సత్వర న్యాయం చేయడానికి ప్రతి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా ఎస్పీ తెలిపారు. ఈరోజు నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి 33 ఫిర్యాదులు స్వీకరించి, ఆయా పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ చేసి బాధితుల సమస్యలను చట్టపరంగా త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా, ప్రజా సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేయడం జరుగుతుందని, పోలీస్ అధికారులు, సిబ్బంది పోలీస్ స్టేషన్ కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించి, వినతులు, ఫిర్యాదులు స్వీకరించి, అవసరమైతే క్షేత్ర స్థాయిలో పరిశీలించి చట్ట ప్రకారం బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు. తద్వారా ఫిర్యాదుదారునికి పోలీస్ శాఖపై భరోసా, నమ్మకం కలుగుతుందన్నారు. గ్రీవెన్స్ డే లో వచ్చిన ఫిర్యాదులు ఆన్ లైన్ లో పొందుపరుస్తూ ఏ మేరకు పరిష్కారం



అయ్యాయో ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ప్రజలకు మరింత సమర్థవంతంగా సేవలందించడం జరుగుతుందని అన్నారు. గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడం ద్వారా సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించేలా చూస్తామని ఎస్పీ తెలిపారు.

# గంభీరావుపేట డిగ్రీ కళాశాలకు జాతీయ స్థాయి అవార్డు

**– జాతీయ స్థాయి అవార్డు అందుకున్న ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వి. విజయలక్ష్మి**

మేకార్తి దినపత్రిక జూన్ 1 గంభీరావుపేట మండలం రిపోర్టర్

రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ మరియు పీజీ కళాశాలకు ఈరోజు అనగా జూన్.1 –2026 పర్యావరణ పరిరక్షణ హరిత కార్యక్రమంలో ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వి. విజయలక్ష్మి గారు గ్లోబల్ పీస్ ఆడిటోరియం గచ్చిబౌలిలో జరిగిన జాతీయస్థాయి అవార్డు ప్రధాన ఉత్సవంలో ప్లాటినం క్యాంపస్ పార్టనర్–2026 జాతీయస్థాయి అవార్డు ప్రిన్సిపాల్ గారు అందుకోవడం జరిగింది. ఈ జాతీయ స్థాయి




అవార్డును రీసెర్చ్ హైట్స్ ఫౌండేషన్ వారు కళాశాలలో పాటిస్తున్న పర్యావరణ పరిరక్షణ, పర్యావరణఅనుకూలత, నీటి సంరక్షణ, మొక్కల పెంపకం విధానాలను అవలంబించిన పద్ధతులకు గాను కళాశాలకు ఈ అవార్డు ప్రధాన చేయడం జరిగింది. ప్రభుత్వ డిగ్రీ కళాశాల గంభీరావుపేట జాతీయస్థాయిలో 44 స్థానం, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొదటి స్థానం దక్కినందుకు ప్రిన్సిపాల్ గారు హర్షం వ్యక్తం చేశారు. ఈ అవార్డు రావడానికి కీలక పాత్ర పోషించిన బాటని అధ్యాపకులు సూచరణ్ ను అభినందించారు. ఈ కార్యక్రమానికి జువాలజీ అధ్యాపకులు డాక్టర్.కె. వి.బిక్షమయ్య విద్యార్థులు సామల్ల సంపత్, రాచర్ల హర్షిత తదితర విద్యార్థిని విద్యార్థులు పాల్గొని కార్యక్రమం విజయవంతం చేశారు.

# గంభీరావుపేట నూతన ఎస్సైగా శ్రీకాంత్

మేకార్తి దినపత్రిక జూన్ 1 గంభీరావుపేట మండల రిపోర్టర్



రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట నూతన ఎస్సైగా సిహెచ్ శ్రీకాంత్ సోమవారం ఉదయం బాధ్యతలు స్వీకరించారు ఇక్కడ పనిచేసిన అనిల్ కుమార్ సిరిసిల్ల సిసిఎస్ కు బదిలీ చేయగా సిరిసిల్ల టూ టౌన్ ఎస్సైగా పనిచేస్తున్న శ్రీకాంత్ గంభీరావుపేట మండల కేంద్రంలో సోమవారం ఎస్సైగా చార్జ్ తీసుకున్నారు పలువురు రాజకీయ నాయకులు పోలీస్ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు ఈ సందర్భంగా నూతన ఎస్ఐ మాట్లాడుతూ మండలంలోని ప్రజలు శాంతిభద్రతలను భంగం కలిగిస్తే ఉపేక్షించేది లేదని ప్రజలు ఎక్కడైనా చట్ట వ్యతిరేక పనులు పాల్పడితే సమాచారం అందించాలని వారి వివరాలు గోప్యిశీగా ఉంచుతామని తెలిపారు

# ఐఐఐటి బాసరలో సీటు సాధించిన బుర్ర మధుప్రియ

మేకార్తి దినపత్రిక( జూన్ 1) గన్నేరువరం మండల ప్రతినిధి బుర్ర కోటేష్ గౌడ్



తిమ్మాపూర్ మండలంలోని మల్లాపూర్ గ్రామంలోని జడ్.పి.హెచ్.ఎస్ పాఠశాలలో ని విద్యార్థి బుర్ర మధుప్రియ పదవ తరగతి మండల టాపర్ గా మరియు ఐఐఐటి బాసరలో ప్రవేశానికి బుర్ర మధు ప్రియ ఎంపికై పాఠశాలకు గర్వకారణమయ్యారు. ప్రధానోపాధ్యాయరాలు ఉమారాణి మాట్లాడుతూ విద్యార్థులు వారి భవిష్యత్తు మరింత ఉజ్వలంగా ఉండాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులు కూడా లక్ష సాధన కోసం కష్టపడి చదివితే ఉన్నత విద్యా అవకాశాలను అందిపుచ్చుకోవచ్చని ఈ విజయం మరోసారి నిరూపించిందని ప్రధానోపాధ్యాయురాలు పేర్కొన్నారు. బుర్ర మధుప్రియ గ్రామస్తులు అభినందించారు.

# అధికారికంగా ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశం



మేకార్తి దినపత్రిక, జూన్ 01 చందుర్తి మండల రిపోర్టర్

ప్రభుత్వ ఆదేశాల మేరకు, వేములవాడ నియోజకవర్గంలోని లింగంపేట గ్రామంలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు ఈరోజు అధికారికంగా గృహ ప్రవేశం చేసుకోవడం జరిగింది.ప్రభుత్వ సహకారం: గౌరవ వేములవాడ శాసనసభ్యులు మరియు ప్రభుత్వ విప్ గారి చొరవతో, గ్రామ సర్పంచ్ కొక్కుల నరేష్ ఉపసర్పంచ్ ఎల్లయ్య.కార్యదర్శి గారు లింగమ్మూర్తి మరియు ఇందిరమ్మా. కమిటీ. తర్రే గణేష్ ఇందూరి రాజు కొత్తపెల్లి రామచంద్రం తర్రే సుమత మరియు గ్రామ వార్డు మెంబర్స్. లింగంపెల్లి శేఖర్. లింగంపెల్లి గంగ జెల. పురుగుల కవిత తర్రే ఆనంద్ కాంగ్రెస్ నాయకులు. సుధాకర్. నరేష్ సంజీవ్ లక్ష్మి రాజాం. వినోద్. పవన్ మనోజ్ లచ్చయ్య అధికారుల సమక్షంలో ఈ కార్యక్రమం ప్రశాంతంగా జరిగింది. నేడు వారి సొంతింటి కల సాకారం అయ్యింది.పార్టీలకు అతీతంగా: ఇది ఏ ఒక్క పార్టీ విజయం కాదు. ఇది లింగంపేట ప్రజల విజయం. అర్హులైన ప్రతి పేదవాడికి ఇల్లు అందించడమే ప్రభుత్వ లక్ష్యం.ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ, "మా మీద దయ చూపి ఇల్లు మంజూరు చేసిన ప్రభుత్వానికి, సహకరించిన

# ముస్తాబాద్ నూతన ఎస్సైగా జ్యోతి బాధ్యతలు స్వీకరించారు

మేకార్తి దినపత్రిక జూన్ 01 ముస్తాబాద్




రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ పోలీస్ స్టేషన్ కు నూతన ఎస్ఐగా జి. జ్యోతి సోమవారం ఉదయం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన సి హెచ్ గణేష్ ను సిరిసిల్ల టౌన్‌కు బదిలీ చేయగా డిసి ఆర్ బి సిరిసిల్ల లో పనిచేస్తున్నజ్యోతి ఎస్ఐగా బదిలీపై వచ్చారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలం లో శాంతి భద్రత ల పరిరక్షణ కు కృషి చేస్తామని, అసాంఘిక కార్యకలాపాల పై ప్రత్యేక నిఘా ఉంచుతానని తెలిపారు. ఈ సందర్భంగా ఆమెకు పలువురు నాయకులు, పోలీస్ సిబ్బంది శుభాకాంక్షలు తెలియచేశారు మండలంలోని శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే ఉపేక్షించేది లేదని, ప్రజలు ఎక్కడైనా చట్ట వ్యతిరేక పనులకు పాల్పడితే సమాచారం అందించాలని, వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

# వర్గీకరణ సాధనలో ఉద్యోగుల పాత్ర కీలకమైనది.




మేకార్తి దినపత్రిక జూన్ 01 సిద్దిపేట జిల్లా బ్యూరో కర్రోల్ల అన్నమ్మ.

మంచిర్యాల జిల్లా వీజుఖీ నూతన కమిటీ ని ఎన్నుకోవడం జరిగింది.అధ్యక్షులు : రాజగట్టయ్య ప్రధాన కార్యదర్శి : రామంచ సంపత్ కోశాధికారి : ఆకునూరి ఆంజనేయులు అదనపు ప్రధాన కార్యదర్శి: అవునూరి తిరుపతి మరియు జిల్లా పూర్తి స్థాయి కమిటీని ఎన్నుకోవడం జరిగింది .ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులు గా మంద దేవేంద్ర ప్రసాద్ మాదిగ రాష్ట్ర అధ్యక్షులు చేబర్తి యాదగిరి మాదిగ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుందిల్ల రామేష్ మాదిగ రాష్ట్ర ఉపాధ్యక్షులు హాజరు కావడం జరిగింది.భవిష్యత్ లో జరగబోయే దండోరా ఉద్యమంలో మరింత శక్తివంతం గా వీజుఖీ ను నిర్మాణం చేద్దామని తెలియజేసినారు.

# మృతుని కుటుంబాన్ని పరామర్శించిన వంగ మహేందర్ రెడ్డి.



మేకార్తి దినపత్రిక మే 01 సిద్దిపేట జిల్లా బ్యూరో కర్రోల్ల అన్నమ్మ.

సురభి మురలీధర్ రావు సురభి ప్రసాద్ రావు తండ్రి చనిపోవడం చాలా బాధాకరం. ఈ విషయం తెలుసుకొని సిద్దిపేట పట్టణం భరత్ నగర్ లో వారి నివాసమునకు వెళ్లి పార్థివ దేహానికి నివాళులర్పించి మురలీధర్ రావు మరియు ప్రసాద్ రావు ని ఓదార్చి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేసిన పి ఆర్ టి యు టి ఎస్ అధికార ప్రతినిధి వంగ మహేందర్ రెడ్డి. ఈ కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు మల్లు గారి ఇంద్రసేనారెడ్డి అసోసియేట్ అధ్యక్షులు సురేందర్ రెడ్డి పాల్గొన్నారు.

# హుజూరాబాద్‌లో బీఎస్పీ విస్తరణపై నాయకుల సమీక్ష

గడపగడపకు బీఎస్పీని తీసుకెళ్లాలి: పార్టీ నేతలు



మేకార్తి దినపత్రిక

బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) హుజూరాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ ముఖ్య నాయకుల సమావేశం ఆదివారం జమ్మికుంటలో జరిగింది. నియోజకవర్గ అధ్యక్షుడు మంద సమ్మయ్య అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశానికి రాష్ట్ర నాయకుడు దొడ్డె సమ్మయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి సెక్టార్ కమిటీలు, బూత్ కమిటీల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించాలని నాయకులకు సూచించారు. గ్రామ స్థాయి నుంచి పార్టీని మరింత ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు అందరూ సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.రానున్న ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని గ్రామ గ్రామాన బీఎస్పీ సిద్ధాంతాలను ప్రజలకు వివరించాలని, ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని కోరారు.సమావేశంలో నియోజకవర్గ ఇన్‌చార్జిలు డాక్టర్ అంబాల ప్రభాకర్, వేల్పుల మల్లేష్, మారముల్ల సాంబయ్య, రాచపల్లి రమేష్, గరిగే చంద్రయ్య, రామ్ శ్రీనివాస్, మొలుగూరి శ్రీనివాస్, బీసీ నాయకులు మామిండ్ల మల్లయ్య, దాసరపు ప్రవీణ్, అంబాల అంజి, కోరి రంజిత్, మడిపల్లి చక్రపాణి, సోషల్ మీడియా ఇన్‌చార్జి మంద జగన్ తదితరులు పాల్గొన్నారు.

# వేల్పుల దాసు నివాళులర్పించిన వైఎస్ఆర్ సీపీ నేతలు

మేకార్తి దినపత్రిక



జగ్గయ్యపేట నియోజకవర్గం పెనుగంచిప్రోలు గ్రామం రాష్ట్ర అధికార ప్రతినిధి వేల్పుల రవికుమార్ తండ్రి వేల్పుల దాసు మరణించిన విషయాన్ని తెలుసుకొని వారి నివాసానికి ఎన్టీఆర్ జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దేవినేని అవినాష్ నందిగామ మాజీ శాసనసభ్యులు మొండితోక జగన్మోహనరావు కలసి వారి భౌతిక కాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళు లర్పించిన జగ్గయ్యపేట నియోజకవర్గ వైఎస్ఆర్ సీపీ ఇన్-ఛార్జ్ తన్నీరు నాగేశ్వరరావు

వారితోపాటు రాష్ట్ర జిల్లా నియోజకవర్గ మండల గ్రామస్థాయి నాయకులు తదితరులు నివాళులర్పించారు

# బిజెపి యూత్ అధ్యక్షుడు తోట నారాయణ భారతదేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మాన్ కి బాత్ ప్రత్యక్ష ప్రసారం

- ముఖ్య అతిథిగా బిజెపి జిల్లా నాయకుడు కలిగోట గంగాధర్



మేకార్తి దినపత్రిక

నేడు అర్మూర్ పట్టణంలో 35 వ వార్డ్ లో బీజేపీ బూత్ అధ్యక్షులు తోట నారాయణ ఆధ్వర్యంలో భారతదేశ ప్రధానమంత్రి నరేంద్ర మోది మన్కి బత్ 134 ఎపిసోడ్ కార్యక్రమాన్ని విక్షించడం జరిగింది. ఇట్టి కార్యక్రమం లో బీజేపీ జిల్లా నాయకులు కలిగొట గంగాధర్ ముఖ్య అతిథిగా పాల్గొనడం జరిగింది. మన్ కి బత్ కార్యక్రమం అనంతరం కలిగొట గంగాధర్ మాట్లాడుతూ మనకి బత్ కార్యక్రమన్ని భారత ప్రధాని నరేంద్ర మోది విజయదశమి రోజు 2014 అక్టోబర్ 3 న ప్రారంభించడం జరిగిందని, ఈ కార్యక్రమం ప్రతినెలా చివరి ఆదివారం రోజున ఉదయం 11 గంటలకు ప్రారంభం అవుతున్నదని ప్రతి భారతీయ పౌరుడు విక్షించాలని అన్నారు. భారతదేశ ప్రధానమంత్రి నరేంద్ర మోది రాజకీయాలకు అతీతంగా భారత దేశం లోని సామజిక సమస్యలు, క్రీడలు, ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ, దేశం కోసం విశేష కృషి చేసిన సాధారణ వ్యక్తుల గురుంచి మాట్లాడుతూ వారిని అభినందిస్తూ ప్రజలతో పలుపంచుకోవడం అభినందనీయం అని అన్నారు. మనకి బత్ కార్యక్రమం ద్వారా ప్రతినెలా మోడీజీ ప్రజలకు మరింత చేరువ అవుతున్నారని అన్నారు. ఇట్టి కార్యక్రమం లో బీజేపీ బూత్ అధ్యక్షులు తోట నారాయణ, బీజేపీ నాయకులు దోమకొండ రవీందర్, అజయ్, మల్లయ్య పాల్గొన్నారు.




# టాక్ యావరేజ్.. కలెక్షన్స్ సూపర్ హిట్.. మరి 'దృశ్యం 4' ఉంటుందా?

మోహన్‌లాల్ కీలక పాత్రలో జీతూ జోసెఫ్ దర్శకత్వంలో వచ్చిన తాజా క్రైమ్ మిస్టరీ థ్రిల్లర్ 'దృశ్యం3' . గతం చిత్రాలకు కొనసాగింపుగా ఈ మూవీని తీర్చిదిద్దారు. మలయాళంతో పాటు, తెలుగులోనూ విడుదలైన ఈ సినిమా మిశ్రమ స్పందనలకే పరిమితమైంది. మరీ ముఖ్యంగా ప్రథమార్ధమంతా సాగదీత వ్యవహారమంటూ సమీక్షకులు, విమర్శకులు అభిప్రాయం వ్యక్తం చేశారు. కానీ అవేవీ 'దృశ్యం3' వసూళ్లను ఆపలేకపోయాయి. ద్వితీయార్థం, ముఖ్యంగా చివరి గంట కథ, కథనాలను ఆసక్తికరంగా థ్రిల్ పంచేలా నడపడంలో జీతూ మార్క్ కనపడింది. అదే ఇప్పుడు ఈ మూవీని నిలబెట్టింది. వసూళ్లలో సరికొత్త రికార్డులు సృష్టిస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా ఈ మూవీ రూ.200 కోట్లకు పైగా రాబట్టి, అత్యధిక వసూళ్ల మలయాళ చిత్రాల్లో ఒకటిగా నిలిచింది.

### ఇండియాలో రూ.100 కోట్లు

మే 21న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ మూవీ తాజాగా భారత్‌లో రూ. 105 కోట్లు (గ్రాస్) రాబట్టింది. శనివారం దేశవ్యాప్తంగా 2,570 షోలు పడగా, రూ. 5. 05 కోట్లు వచ్చాయి. ఓవర్సీస్‌లోనూ ఈ మూవీని ప్రేక్షకులు ఆదరిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా రూ. 113. 75 కోట్లు వసూలు చేయగా, మొత్తం రూ. 219 కోట్లకు పైగా రాబట్టింది. తాజా వసూళ్లతో అత్యధిక కలెక్షన్స్ రాబట్టిన మలయాళ చిత్రాల్లో ఆరోస్థానంలో నిలిచింది. రూ. 303 కోట్లతో ఇప్పటికీ 'కొత్తలోక: చాప్టర్1' టాప్‌లో ఉండటం గమనార్హం.

### దృశ్యం4 ఉంటుందా?

'దృశ్యం3' బాక్సాఫీస్ వద్ద విజయవంతమైతే 'దృశ్యం 4, 5' కూడా రావొచ్చని మోహన్‌లాల్, దర్శకుడు జీతూ జోసెఫ్ పలు వేదికలపై అభిప్రాయం వ్యక్తం చేశారు. అన్నట్లుగా ప్రస్తుతం 'దృశ్యం3' బాక్సాఫీస్ వద్ద జోష్ చూపిస్తోంది. ఈ క్రమంలో నాలుగో భాగం వచ్చే అవకాశాన్ని కొట్టిపారేయలేం. అయితే, ఇప్పటికిప్పుడే అది సాధ్యమయ్యే పని కాదు. ప్రస్తుతం విజయాన్ని ఆస్వాదిస్తున్న చిత్ర బృందం నుంచి కూడా ఎలాంటి ప్రకటనా రాలేదు. అలాగని, చెప్పిన కథే మళ్లీ చెప్పి పిప్పి పిప్పి చేసి, చివరో ఓ ట్విస్ట్‌తో ముగిస్తానంటే కుదరదు. చూద్దాం..! దేనికైనా కాలమే సమాధానం చెబుతుంది.

# 'నో' చెప్పడం కూడా నేర్చుకుంటేనే...!

మాతృత్వ దశ తన జీవితాన్ని మార్చివేసింది కానీ తాను పనిచేసే విధానాన్ని మాత్రం మార్చలేదని అంటోంది బాలీవుడ్ కథానాయిక యామీ గౌతమ్. 'ఆర్టికల్ 370', 'హక్' లాంటి శక్తిమంతమైన కథలతో ప్రయాణిస్తున్న నాయికీమె. ఇటీవలే 'ధురంధర్ 2'లో అతిథి పాత్రలో మెరిసిన ఈమె.. ప్రస్తుతం 'నయీ నవేలి' అనే సినిమాతో బిజీగా ఉంది. ఈ నేపథ్యంలోనే ఇటీవలే ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న యామి.. కొన్ని ఆసక్తికర విషయాలతో అభిమానుల ముందుకొచ్చింది. "ఇటీవలే నేను బాబుకి జన్మనిచ్చిన విషయం అందరికీ తెలిసిందే. కానీ తల్లి కావడం నా వృత్తిపరమైన ఎంపికలను ఏ మాత్రం ప్రభావితం చేయలేదు. వ్యక్తిగత, వృత్తిపర జీవితాల మధ్య సమతుల్యతను పాటించాలనే విషయం గురించి నాకు తెలుసు. ఒక్కసారి మీరు తల్లి అయ్యాక.. ఆ గుర్తింపు అన్నివేళలా మీతోనే ఉంటుంది. సెట్‌లో నేను ఒక నటిగా పనిచేస్తున్నప్పటికీ.. ప్రతి క్షణం నేను ఒక తల్లినే. మాతృత్వం అనేది గొప్ప భావోద్వేగం. ఇలాంటి అద్భుతమైన అనుభూతిని పొందినందుకు నేను చాలా అదృష్టవంతురాలిని".

### సందేహంగా ఒప్పుకున్నా.. సాగిపోవాలి

"సినీరంగంలో నా దశాబ్దాల కెరీర్‌ను వెనక్కి తిరిగి చూసుకుంటే.. నా ఎదుగుదలకు దృఢ సంకల్పమే ముఖ్య కారణం. ఒకానొక దశలో నేను విజయాల వెంట పడటం మానేసి.. నా మనసుకు నిజంగా హత్తుకునే కథలకు ప్రాధాన్యత ఇవ్వడం ప్రారంభించాను. దీనికి సహనం ఎంతో అవసరం. మీరు అవకాశాలను వెతుక్కునే సమయంలో మీకు సరిపోయే ఆ ఒక్క సినిమాను, పాత్రను కూడా గుర్తించడం చాలా ముఖ్యం. ఈ క్రమంలో కొన్నిసార్లు 'నో' చెప్పడం కూడా నేర్చుకోవాలి. కొందరు సందేహంగానే కొన్ని ప్రాజెక్టుల్ని ఒప్పుకొని ఉండొచ్చు. అయినా మీరు ముందుకు సాగుతూనే ఉండాలి. అందరికీ కనిపించేలా పనిచేస్తూనే ఉండాలి".

### అతిగా ఆలోచించను

"జీవితంలో ఒక దశకు చేరుకున్న తర్వాత మనలో భయం పోతుంది. నా విషయంలో అది 'బాలా', 'ఉరి' సినిమాల సమయంలో జరిగింది. పాత్రలు నన్ను ఆకట్టుకుంటేనే వాటిని అంగీకరించాలని అప్పుడే గట్టిగా నిర్ణయించుకున్నా. నేను కొన్ని విషయాల గురించి అతిగా ఆలోచించను. నచ్చకపోతే.. అది నాకు వెంటనే తెలిసిపోతుంది. ఏదేమైనా నా మనసు చెప్పేదే నమ్ముతా".



# మే మెరుపుల్లేవ్!



వేసవి సినీ మారథాన్‌కి జూన్ క్లైమాక్స్ అయితే.. ప్రీక్లైమాక్స్ మే. జూన్ రెండో వారానికే సెలవుల సీజన్ ముగుస్తుంది కనుక.. ఈ సీజన్‌లో ఆఖరిగా వచ్చే బడా చిత్రాలన్నీ మేలోనే మెరుపులు మెరిపించేందుకు బాక్సాఫీస్ ముందుకు వరుస కడుతుంటాయి. అయితే కొవిడ్ తర్వాత నుంచి ఈ పరిస్థితులన్నీ పూర్తిగా తారుమారయ్యాయి. గత నాలుగైదేళ్లలో తెలుగు చిత్రసీమ ఒక్క వేసవి సీజన్‌నీ పూర్తిగా సొమ్ము చేసుకోలేకపోయింది. ఇక ఈసారైతే మరింత గడ్డు పరిస్థితి. సమ్మర్‌లో ఇంతవరకు సరైన సినిమా పడలేదని ఇటు ప్రేక్షక లోకం.. అటు సినీ పరిశ్రమ ముక్త కంఠంతో చెబుతోంది. మార్చి, ఏప్రిల్‌లో ఒకటి రెండు చెప్పుకోదగ్గ చిత్రాలైనా థియేటర్లలో సందడి చేసినా.. కీలకమైన మేలో ఒక్కటంటే ఒక్కటీ చెప్పుకోదగ్గ సినిమా కనిపించకపోవడం సినీ ప్రేమికుల్ని, పరిశ్రమ వర్గాల్ని కలవరపాటుకు గురి చేస్తోంది. ఈ మేలో నేరుగా తెలుగు చిత్రసీమ నుంచి దాదాపు ఇరవై చిత్రాల వరకు బయటకొచ్చినా.. అందులో ఏ ఒక్కటీ ప్రేక్షకుల్ని థియేటర్ల బాట పట్టించలేకపోయింది. ఆ వచ్చిన వాటిలో ఏ ఒక్క దాంట్లోనూ స్టార్ కళ కనిపించకపోవడం.. ప్రేక్షకుల్ని థియేటర్ల బాట పట్టించే కంటెంట్ లేకపోవడం పెద్ద లోటు. మే తొలివారం తరుణ్ భాస్కర్ 'గాయపడ్డ సింహం', సత్య 'జెట్లీ' చిత్రాలు బాక్సాఫీస్ బరిలో తలపడ్డాయి. వీటిలో తరుణ్ సినిమాకి పాస్ మార్కులు పడ్డప్పటికీ.. థియేటర్లకు కళ తెచ్చే స్థాయిలో వసూళ్లు రాలేదు. ఆ మరుసటి వారం 'గోదారి గట్టుపైన', 'రేజర్', 'సతీ లీలావతి'.. ఇలా నాలుగైదు చిత్రాలు అదృష్టం పరీక్షించుకున్నాయి. కానీ, వీటిలో ఏ ఒక్కటీ సినీప్రియుల దృష్టిని ఆకర్షించలేకపోయాయి. ఇక మే చివరి మూడు వారాల్లో తెలుగు నుంచి 'దూరదర్శిని', 'హరుడు', 'మిస్టర్ వర్క్ ఫ్రమ్ హోం', 'పురుషః', 'ఫస్ట్ టైమ్', 'రమణీ కల్యాణం', 'అగ్లీ స్టోరీ', 'త్రికాల', 'మరీచిక', 'సందిగ్ధం' లాంటి డజను వరకు చిన్న చిత్రాలు థియేటర్ల ముందుకొచ్చినా.. ఏ ఒక్కటీ కనీస వసూళ్లని కూడా రాబట్టలేకపోయింది. అనువాదాలు సొమ్ము చేసుకున్నాయి..

ఈ మేలో తెలుగు చిత్రసీమకి కూడా కాస్తోకూస్తో ఊపిరిపోసినవి అనువాద చిత్రాలే. మే రెండో వారంలో సూర్య 'వీరభద్రుడు' సినిమాతో.. మూడో వారంలో మోహన్‌లాల్ 'దృశ్యం 3'తో బాక్సాఫీస్ బరిలో సందడి చేశారు. నిజానికి వీటికి తెలుగులో సరైన ప్రచారం లేకున్నా... రివ్యూల పరంగా మిశ్రమ స్పందన లభించినా.. చెప్పుకోదగ్గ స్థాయిలో టికెట్లు తెగడం, మంచి వసూళ్లు రాబట్టడం విశేషం. కాస్త కంటెంట్ ఉన్న సినిమా పడి.. దానికి స్టార్ బలం కూడా తోడైతే ఎండల్నీ, ఐపీఎల్‌నీ లెక్క చేయకుండా జనాలు థియేటర్లకు వస్తారనడానికి ఈ అనువాదాలు నిదర్శనంగా నిలిచాయి. ఇక ఆఖరి వారంలో అర్జున్, ప్రీతి ముకుందన్ ప్రధాన పాత్రల్లో నటించిన అనువాద చిత్రం 'బ్లాస్ట్'కు ప్రేక్షకుల నుంచి మంచి మౌత్ టాక్ లభిస్తోంది.

# ఎప్పటికీ మీరే నా హీరో: మహేశ్‌బాబు పోస్టు

తన తండ్రి, నటుడు దివంగత కృష్ణ జయంతి సందర్భంగా మహేశ్‌బాబు ఎమోషనల్ పోస్టు పెట్టారు. 'ఎప్పటికీ మీరే నా హీరో. హ్యాపీ బర్త్ డే నాన్నా' అంటూ తండ్రిపై ప్రేమను వ్యక్తం చేశారు. మహేశ్ సతీమణి నమ్రతా శిరోద్కర్ కూడా కృష్ణను స్మరించుకున్నారు. ఎప్పుడూ ప్రేమతో మిమ్మల్ని తలచుకుంటూనే ఉంటామంటూ పోస్టు చేశారు

### కృష్ణ సేవలు చిరస్మరణీయం: సీఎం చంద్రబాబు

కృష్ణను స్మరించుకుంటూ.. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ట్వీట్ చేశారు. "తెలుగు సినీ పరిశ్రమకు నటుడిగా, దర్శకుడిగా, సాహసోపేత నిర్మాతగా విశిష్ట



సేవలందించిన పద్మభూషణ్ కృష్ణ గారి జయంతి సందర్భంగా ఆయనను స్మరించుకుంటున్నా. నూతన సాంకేతికతలను పరిచయం చేస్తూ సినీ రంగ అభివృద్ధికి విశేషంగా కృషి చేసిన ఆయన సేవలు చిరస్మరణీయం. అభిమానుల హృదయాల్లో శాశ్వత స్థానం సంపాదించిన ఆ మహానటుడికి ఘన నివాళులు" అని పేర్కొన్నారు.

# ఇండస్ట్రీ సమస్యలు.. దాసరి దారి చూపారు..

# హీరోలకు మంచు మనోజ్ విజ్ఞప్తి

ప్రస్తుతం ఇండస్ట్రీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి దర్శకరత్న దాసరి నారాయణరావు ఎప్పుడో దారి చూపారని మంచు మనోజ్ అన్నారు. దాసరి నారాయణరావు సమాధి దుస్థితి చూసి చలించిపోయిన ఆయన తన టీమ్‌తో కలిసి శుభ్రం చేసిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా తన సతీమణి మౌనికతో కలిసి దాసరి విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ "గురువుగారు దాసరి వర్ధంతి అన్న సంగతి నాకూ గుర్తులేదు. చిత్రపురి కాలనీ వైపు వస్తుంటే, ఆ దారిలో గురువుగారి విగ్రహం ఉంటుంది. అది చూడగానే ఆయన కుటుంబం గుర్తు వచ్చింది. ఈలోగా ఆయన సమాధి పరిస్థితి తెలుసుకుని నా టీమ్‌తో కలిసి ఉదయాన్నే వచ్చేశా. అందరూ ఎంతో శ్రమించారు"

"దాసరిగారు గొప్ప దర్శకుడు. స్క్రీన్‌ప్లే రైటర్. ఎడిటింగ్, మ్యూజిక్, డైలాగ్స్ ఇలా అన్నింటిపైనా పట్టు కలిగిన వ్యక్తి. ఒక్క మాటలో చెప్పాలంటే ఆయనొక ఇనిస్టిట్యూట్. ఆయన ఎన్నో గొప్ప సినిమాలు తీశారు. సోషల్, కమర్షియల్, మహిళా ప్రాధాన్యమున్న చిత్రాలు రూపొందించారు. 'దాసరి పని అయిపోయింది' అని టాక్ వినిపించిన ప్రతిసారీ కొత్తదనంతో ప్రేక్షకులను అలరించారు. ప్రస్తుతం మనం



థియేటర్స్ సమస్యలంటూ మాట్లాడుకుంటున్నాం. కానీ, నాకు తెలిసి గురువుగారు ఎప్పుడో దీనికి ఓ మార్గం చూపించారు. ఏడాదికి పది నుంచి పదిహేను సినిమాలు చేస్తూ.. ఎంతో మందికి ఉపాధి లభించేలా చేశారు. ఎప్పుడో ఓ సినిమా చేయటం కాదు.. ఎప్పుడూ సినిమా చేయాలని దాసరి అనేవారు. ఇకపై నాతో సహా అందరూ హీరోలు వీలైనన్ని ఎక్కువ సినిమాలు చేయాలని కోరుతున్నాను. ఆ బాధ్యత అందరిపైనా ఉంది. దాసరి ఘాట్‌ను పార్క్‌లా కాకుండా చుట్టు పక్కల పిల్లలు ఆడుకునేలా తీర్చిదిద్దితే బాగుంటుందని అనుకుంటున్నా" అని అన్నారు.

PRINTED,PUBLISHED & OWNED BY MEKARTHI SRINIVAS, Printed at SUNDAY PRINTING PRESS, H.No. 3-4297, SARASWATHI COMPLEX,SVN COLONY GUNTUR,ANDHRA PRADESH-522006.& Published from H.No. 12-166, RAJIV NAGAR,MUSTABAD, RAJANNA SIRICILLA DISTRICT-505404 TELANAGNA,.
RNI No.TGTEL /25/A2356,Editor : MEKARTHI SRINIVAS, Cell: 9014726022.e-mail: MEKARTHI DINAPATRIKA@gmail.com